

ఇది ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలోని జగనన్న కాలనీ. అది స్వయానా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం. గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఊరిలో జగనన్న కాలనీలు నిర్మిస్తామని అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రగల్భాలు పలికారు. ఆ పార్టీ తరఫున అప్పట్లో ఎమ్మెల్యేగా ఉన్న ప్రకాష్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా జగనన్న కాలనీల నిర్మాణ టెండర్ దక్కించుకున్నారు. అన్ని జిల్లాల్లో జగనన్న కాలనీలు నిర్మించినట్లు కలరింగ్ ఇచ్చారు. చాలాచోట్ల పునాదులు కూడా పడలేదు. విచిత్రమేమిటంటే స్వగ్రామం తోపుదుర్తిలోనే జగనన్న కాలనీని పూర్తి చేయలేకపోయారు ప్రకాష్‌రెడ్డి. కాలనీ అడవిని తలపిస్తోంది. ఐదేళ్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయారు. ఎక్కడివక్కడ ఆగిపోయాయి. ఇక, రాష్ట్రవ్యాప్తంగా ఏ స్థాయిలో జగనన్న నిర్మాణాలు చేపట్టి ఉంటారో అర్థం చేసుకోవచ్చు.

ఇది మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్వగ్రామంలోని ఆయన ఇంటికి వెళ్లే రోడ్డు. ఐదేళ్లు అధికారంలో ఉన్నా.. సొంత ఇంటికెళ్లే రోడ్డులో మురుగు కాలువలో తవ్వించలేకపోయారు ప్రకాష్‌రెడ్డి. దీంతో మురుగు నీరు వెళ్లే మార్గంలేక ఇలా రోడ్డుపైకి చేరుతోంది. అక్కడే నిల్వ ఉంటోంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటూ దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు.



మాజీ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే దారిలో నిల్వ ఉన్న మురుగు నీరు



గత వైసీపీ ప్రభుత్వంలో సర్కారీ బడులను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేస్తామని అప్పటి ముఖ్యమంత్రి జగన్ ప్రకటనలు గుప్పించారు. నాడు-నేడుతో పాఠశాలల రూపురేఖలు మార్చేస్తామన్నారు. క్షేత్రస్థాయిలో అమలు కాలేదనీ, అవన్నీ వట్టి మాటలేనన్నది బహిరంగ రహస్యమే. అదే పార్టీకి చెందిన అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం తోపుదుర్తిలోని ప్రాథమిక పాఠశాలే అందుకు నిదర్శనం. గత ప్రభుత్వంలో పాఠశాలలో నాడు-నేడు కింద అదనపు తరగతి గది నిర్మాణం చేపట్టారు. ఐదేళ్లలో పూర్తి చేయలేకపోయారు. అర్ధాంతరంగా పనులు ఆగిపోయాయి. నేటికీ ఆ భవనం అలానే కనిపిస్తోంది. పాఠశాలలో కనీసం శుద్ధనీటి యంత్రాన్ని ఏర్పాటు చేయలేకపోయారు. అందుకు సంబంధించిన సామగ్రి వచ్చినా.. మూలన పడేశారు. దీంతో పేద విద్యార్థులకు శుద్ధనీరు దక్కకుండా పోయింది. విద్యాభివృద్ధిపై గత పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనం తోపుదుర్తి పాఠశాల.

అభివృద్ధి ఎక్కడ బ్రదర్స్..?

సమస్యల వలయంలో మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం

తోపుదుర్తిలో డ్రైనేజీ కాలువలు కూడా లేని దుస్థితి

- రోడ్లపైనే మురుగునీరు
- అసంపూర్తిగా నాడు-నేడు పనులు
- జగనన్న కాలనీలో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలు
- ఐదేళ్లు అధికారంలో ఉన్నా.. సొంతూరికి చేసింది శూన్యం

జీసీ కాలనీలో రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు



ఆత్మకూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి స్వగ్రామం మండలంలోని తోపుదుర్తి సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తోపుదుర్తి బ్రదర్స్ గొప్పలు పోతుంటారు. వారి స్వగ్రామంలోనే అభివృద్ధి కరువైంది. గెలిపించిన ఊరినే తోపుదుర్తి సోదరులు పట్టించుకోలేదని గ్రామస్థులు విమర్శిస్తున్నారు. గ్రామంలో 520 కుటుంబాలు నివాసముంటున్నాయి. వారికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేశారనే విమర్శలు ఉన్నాయి. గ్రామంలో తాగునీరు లేక, మురుగునీటితో నిండిన వీధులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న శుద్ధజల ప్లాంటు సామగ్రి

రోడ్లపైనే మురుగునీరు

గ్రామంలో మురుగు కాలువలు లేక రోడ్డుపైనే మురుగు నీరు ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల ముందు నడవలేకపోతున్నారు. పీర్ల మసీదు వీధి, ప్రధాన రోడ్డు, బీసీ కాలనీ, వాల్మీకి విగ్రహం పడమటి వీధి, చెరువు దారి పక్క వీధి, కాపుగేరి తదితర ప్రాంతాల్లో మురుగు నీటితో తీవ్ర అసౌకర్యంగా మారింది. రోడ్లపైనే మురుగునీరు నిల్వ ఉంటోంది. దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్థులు వాపోతున్నారు. సమస్యలతో సతమవుతున్నామని వాపోతున్నారు.



మాట్లాడుతున్న మంత్రి సవిత

పేదల గుండె ధైర్యం పరిటాల

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత
- పెనుకొండలో పరిటాల రవి విగ్రహావిష్కరణ

పెనుకొండ టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పరిటాల అంటే పేరు కాదని, పేద ప్రజల గుండె ధైర్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అన్నారు. పెనుకొండ దర్గా సర్కిల్‌లో తను స్వయంగా ఏర్పాటు చేయించిన మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాన్ని ఆమె శనివారం ఆవిష్కరించారు. అంతకు మునుపు పరిటాల కుటుంబ సభ్యులు, పలువురు ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆమె ప్రసంగించారు. అరాచకాలు, దాడులను ఎదుర్కొనడానికే పరిటాల రవీంద్ర జీవితం మొత్తం సరిపోయిందని అన్నారు. ఆయన ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తనను రాజకీయాలలోకి రావాలని ఆహ్వానించారని, కానీ తన తండ్రి అంగీకరించలేదని అన్నారు. ఆయన కల ఇప్పుడు నెరవేరిందని, తాను రాజకీయాల్లోకి వచ్చి మంత్రిని అయ్యానని అన్నారు. పరిటాల రవీంద్ర మహిళలకు అండగా పెద్దన్నయ్యలా ఉండేవారని, అప్పట్లో తాగునీటి కోసం పరగోడు ప్రాజెక్టు వద్ద యుద్ధం చేశారని అన్నారు. వెనుకబడిన అనంతపురం జిల్లా (మిగతా 6వ పేజీలో...)

బార్‌లకు లక్కీ డ్రా

- దక్కించుకున్నవారికి ధ్రువపత్రాలు



డ్రా తీస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్ (వివరాలు 7లో...)

డీఎంఈగా డాక్టర్ రఘునందన్

- అంచెలంచెలుగా ఎదిగిన అనంత విద్యార్థి
- గుత్తిలో పాఠశాల విద్య.. తిరుపతిలో వైద్య విద్య

(వివరాలు 7వ పేజీలో...)



పెండింగ్ ఉండరాదు

జీఎస్‌డబ్ల్యుఎస్ అంశాలపై కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గ్రామ సచివాలయాలు, వార్డు సచివాలయాల(జీఎస్‌డబ్ల్యుఎస్) అంశాల్లో పెండింగ్ లేకుండా చూడాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జీఎస్‌డబ్ల్యుఎస్ తదితర అంశాలపై ఎంపీడీఓలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ శనివారం సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయాల అంశాలలో భాగంగా కౌశలం సర్వేకు జిల్లాకు 1,14,145 మందిని సర్వే చేయాలనే లక్ష్యం కేటాయించినట్లు తెలిపారు. ఇప్పటివరకు 44,292 మంది సర్వే పూర్తి చేశారన్నారు. మిగిలిన సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం పేమెంట్ ఫెయిల్యూర్ రిపోర్ట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఆధార్ మ్యాపింగ్‌ను పూర్తి చేయాలన్నారు. తల్లికి వందనం సంబంధించి మదర్, చైల్డ్ ఈకేవైసీ పెండింగ్‌ను, గ్రీవెన్స్ పెండింగ్‌ను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మన మిత్ర క్యాంపెయిన్‌లో హౌస్ హోల్డ్ పెండింగ్‌కు సంబంధించి రోజువారి పురోగతిని మరింత పెంచాలన్నారు. సిటిజన్స్ ఈకేవైసీ రిపోర్ట్, ఆధార్ సీడింగ్ ఫర్ వాహన్ డేటా, ఏపీ సేవా సర్వీసెస్ చార్జెస్ పెండింగ్‌ను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల బయోమెట్రిక్ అటెండెన్స్ పూర్తిగా నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. వీసీలో జీఎస్‌డబ్ల్యుఎస్ కోఆర్డినేటర్ ధనుంజయ్, ఈ డిస్ట్రిక్ మేనేజర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు తదితరులు పాల్గొన్నారు.

రయ్ రయ్.. రేస్..!

- కొండ ప్రాంతాల్లో కార్లు.. బైక్‌ల సందడి
- పుట్లూరు.. నార్పల నడుమ దుమ్ము రేపే ఆట

(7వ పేజీలో...)



స్వచ్ఛాంధ్ర మిషన్ డైరెక్టర్‌గా భవాని రవికుమార్



అనంతపురం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జనసేన కార్యక్రమాల నిర్వహణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భవాని రవికుమార్‌ను స్వచ్ఛాంధ్రప్రదేశ్ రాష్ట్ర డైరెక్టర్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జనసేన ఆవిర్భావం నుంచి భవాని రవికుమార్ ఆ పార్టీ అభివృద్ధి కోసం కృషిచేస్తున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ ప్రజావ్యతిరేక కార్యక్రమాలను నిరసిస్తూ అనేక రూపాల్లో ఆందోళనలు నిర్వహించారు. పార్టీలో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్నారు. జనసేనాని ఆదేశాలతో పార్టీ విధి విధానాలను ప్రజల్లోకి తీసుకెళుతున్నారు. మరోవైపు చిరంజీవి యువత రాష్ట్ర అధ్యక్షుడిగా చిరు అభిమానులు, జనసేన శ్రేణులను ఒకతాటిపైకి తెచ్చి.. పార్టీ అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నారు. జనసేనను నమ్ముకుని 15 సంవత్సరాలుగా పనిచేస్తున్న భవాని రవికుమార్ విధేయతను పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ గుర్తించి, పదవి అప్పగించారు. తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత పవన్ కల్యాణ్, మంత్రి నాదెళ్ల మనోహర్, ముఖ్య నాయకులు, కూటమి ప్రభుత్వానికి భవాని రవికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

చెప్పిన దారిలోనే వెళ్లండి..!

- నిమజ్జనోత్సవంపై ఎస్పీ జగదీష్
- అనంతలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు



అనంతపురం క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఆదివారం గణేష్ విగ్రహాల శోభాయాత్ర నిర్దేశించిన రూట్లలోనే సాగాలని ఎస్పీ జగదీష్ సూచించారు. శోభాయాత్ర, నిమజ్జనం వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. అత్యాధునిక సీసీ కెమెరాలు, డ్రోన్ల పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. క్రమపద్ధతిలో విగ్రహాలను తరలించాలని వినాయక ఉత్సవ కమిటీలకు సూచించారు. బాణసంచా కాల్చడం, మద్యం తాగి వేడుకల్లో పాల్గొనడం, భారీగా శబ్దాలు చేయడం సరికాదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహాలను తరలించాల్సిన మార్గాల వివరాలను ఆయన తెలియజేశారు.

రూట్ -1

తాడిపత్రి బస్టాండ్ - బసవన్నకట్ట, సూర్యనగర్ సర్కిల్, జేఎన్‌టీయూ, కలెక్టరేట్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సంఘమేష్ సర్కిల్ మీదుగా సూర్యనగర్ సర్కిల్ వద్ద కలవాలి. అక్కడి నుంచి సప్తగిరి సర్కిల్ చేరుకోవాలి. హౌసింగ్ బోర్డు, విద్యుత్ నగర్ సర్కిల్, నాయక్‌నగర్, ఆదర్శనగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు అశోక్ నగర్, సాయినగర్ మీదుగా సప్తగిరి సర్కిల్‌కు చేరుకోవాలి.

రూట్-2

ఒకటో రోడ్డు నుంచి 6వ రోడ్డు వరకూ, రామచంద్ర నగర్ వైపు నుంచి వచ్చే విగ్రహాలు సైఫుల్లా ఫ్లైవర్ బ్రిడ్జి మీదుగా శ్రీకంఠం సర్కిల్ వద్దకు చేరుకుని, ఎన్టీఆర్ సర్కిల్, (మిగతా 7లో...)

కాణిపాక స్వామికి పట్టు వస్త్రాలు

గుంతకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకుడి బ్రహ్మోత్సవాలకు కసాపురం దేవస్థాన అధికారులు శనివారం ఉదయం పట్టు వస్త్రాలను పంపారు. ఆలయానికి వచ్చిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకట శివుడు యాదవ్ పట్టు వస్త్రాలకు పూజలు చేయించి, వాటిని కాణిపాకం దేవస్థానానికి పంపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, టీడీపీ నాయకులు బండారు ఆనంద్, రామరాజు యాదవ్, పరశురామముడు, నరసింహులు, లింగరాజు, సుంకయ్య, హరిచంద్ర, ఆలయ అర్చకులు రాఘవాచార్యులు, చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.



కాణిపాక వరసిద్ధి వినాయక బ్రహ్మోత్సవాలకు పట్టు వస్త్రాలను పంపుతున్న వెంకట శివుడు యాదవ్, టీడీపీ నాయకులు, అర్చకులు



డబుల్ ధమాకా..!

- ఆవుకు ఒకే ఈతలో రెండు దూడలు జననం

కణేకల్లు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కురుబ నాగరాజు అనే రైతుకు చెందిన ఆవుకు శనివారం ఒకే ఈతలో రెండు దూడలు జన్మించాయి. దీంతో రైతు నాగరాజు హర్షం వ్యక్తం చేశారు. దూడలను చూడడానికి చుట్టు పక్కల రైతులు వచ్చారు.

పెద్దారెడ్డిని అడ్డుకుంటోంది ప్రజలే..!

ఆయన అరాచకాలు విశ్లేషకులకు కనిపించవా..?

మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జేసీ

తాడిపత్రి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వకుండా తాను అడ్డుకోవడం లేదని, ప్రజలే అడ్డుకుంటున్నారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. ఐదేళ్లపాటు ఆయన, ఆయన కుమారుడు హర్షవర్ధన్ రెడ్డి చేసిన అరాచకాలు వారికి శాపంగా మారాయని అన్నారు. తన నివాసం నుంచి శనివారం ఆయన ఓ వీడియోను విడుదల చేశారు. మహిళలు అని చూడకుండా పెద్దారెడ్డి కేసులు బనాయించారని, మహిళా కౌన్సిలర్లను ఆయన కుమారుడు వెంబడించి దాడులు చేశారని అన్నారు. తన అనుచరుడు ఎస్వీ రవీంద్రారెడ్డిని 2019 నుంచి 2024 వరకు ఊరిలోకి రానివ్వకుండా అడ్డుకున్నారని అన్నారు. అలాంటప్పుడు పెద్దారెడ్డి ఇంకో మూడేళ్లు తాడిపత్రిలోకి రాకపోతే ఏమవుతుందని ప్రశ్నించారు. ఇక్కడ రాజకీయం చేయడానికి పెద్దారెడ్డి అనర్హుడని అన్నారు. తాడిపత్రిలో ఏదో జరుగుతోందని విశ్లేషకులు అంటున్నారని, వారికి పెద్దారెడ్డి అరాచకాలు కనిపించవా అని ప్రశ్నించారు. గుత్తి దగ్గర క్రషర్ మిషన్, కోమటికుంట్ల వద్ద సోలార్ భూములు, తాడిపత్రిలో ఇంటి నిర్మాణం.. ఇవన్నీ అక్రమాలు కాదా అని ప్రశ్నించారు. చెట్లను నరికేయడం, సారాయి అమ్మడం, ఆయన భాష, సంస్కృతి కనిపించలేదా అని నిలదీశారు. పెద్దారెడ్డి వల్ల తమ కుటుంబం నాశనమైందని, తాను, తన కొడుకు జైలుపాలయ్యామని అన్నారు. తమ బస్సులను ఐదు సంవత్సరాలు నిలిపివేశారని అన్నారు. అయినా తాము బాధపడలేదని అన్నారు. తాడిపత్రి తమకు దేవాలయమని, ఇక్కడి ప్రజలు దేవుళ్లని అన్నారు. తాడిపత్రి ప్రజల గురించి మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో తాము ఏ పని చేయాలన్నా హౌస్ అరెస్ట్ అన్నారని, డీఎస్పీ చైతన్యను అడ్డు పెట్టుకుని తమ కార్యకర్తలను హింసించలేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక నిమజ్జనోత్సవంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహిళల భద్రత కోసం రోప్ పార్టీని ఏర్పాటు చేశామని తెలిపారు. 20 వేల మంది భక్తుల కోసం అన్నప్రసాదం ఏర్పాటు చేశామని అన్నారు.



ఐదో రోడ్డులో రేణుకా యల్లమ్మ అలంకారంలో గణపతి



రెడ్డివీధిలో అష్టలక్ష్మి సమేత విఘ్ననాథుడు



సాయినగర్ రెండో క్రాస్‌లో కర్ణాటక కరప్పన్ అలంకారం



హరిహర దేవాలయం వద్ద కృష్ణావతార గణపతి




విద్యారణ్య నగర్‌లో ఎలుకపై బాల గణపతి విహారం



మారుతీనగర్ మొదటిక్రాస్‌లో సుబ్రహ్మణ్యేశ్వర గణపతి



కోవూర్‌నగర్‌లో శివరుద్రరూప గణపతి



కమలానగర్‌లో జలకన్య అలంకారంలో



విభిన్ననాయకా.. నమోస్తుతే..!

వినాయక చవితి వేడుకలు ఆఖరి ఘట్టానికి చేరువయ్యాయి. అనంతపురం నగరం సహా పలు ప్రాంతాల్లో ఆదివారం స్వామివారు గంగమ్మ ఒడిలోకి చేరనున్నారు. ఎప్పటిలాగే భిన్నమైన విగ్రహాలను కొలువుదీర్చేందుకు అనంత భక్తులు ఆసక్తి చూపించారు. ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భారీ విగ్రహాల ఏర్పాటుకంటే.. ఆధ్యాత్మిక విశేషాలు, ఆధునికత ఉట్టిపడే విగ్రహాల ఏర్పాటుకే ప్రాధాన్యం ఇచ్చారు. ఇలాంటి విగ్రహాలను దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఎక్కడెక్కడ ఎలాంటి విగ్రహాలను ఏర్పాటు చేశారో తెలుసుకుని, అక్కడికి వెళ్లి తిలకించారు. - ఆంధ్రజ్యోతి, అనంతపురం

ముగిసిన వెరిఫికేషన్

డీఎస్సీ-2025 సర్టిఫికెట్ల పరిశీలన దాదాపు పూర్తి

విడుదల కాని మరో 50మంది అభ్యర్థుల జాబితా

అనంతపురం విద్య, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2025 నియామకాల ప్రక్రియలో అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. రాష్ట్రశాఖ ఇప్పటివరకు రెండువిడతలలో ఎంపిక అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. సెలెక్ట్ జాబితాలో ఉన్న అభ్యర్థులకు నేరుగా రాష్ట్రశాఖ నుంచే కాల్‌లెటర్స్(మెసేజ్‌లు) పంపారు. మొత్తం 757 మందికి పంపగా, ఆ మెసేజ్‌లు వచ్చిన అభ్యర్థులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేపట్టారు. నగర శివారు పీవీకేకే కళాశాలలో ఈ పరిశీలన ప్రక్రియ ఈనెల 28నుంచి కొనసాగించారు జిల్లా పరిశీలకులు జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో 19కమిటీలు ఏర్పాటు చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారు. ఈ ప్రక్రియ శుక్రవారమే ముగియాల్సి ఉన్నా 9మంది గైర్హాజరుకావడంతో వారికి శనివారం వరకు అవకాశం కల్పించారు. దీంతో ఇందులో ఉన్న ఆరుగురు అభ్యర్థులు శనివారం సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరయ్యారు. దీంతో తొలివిడత వెరిఫికేషన్ ప్రక్రియ ముగిసింది.

● ఇద్దరి ఎంపిక తిరస్కరణ, మరొకరికి రేపటి వరకు గడువు

రాష్ట్రశాఖ 757 మందితో సెలెక్ట్ జాబితాను జిల్లాకు పంపింది. ఇందులో మూడు రోజులు జరిగిన సర్టిఫికెట్ల పరిశీలనకు 754 మంది హాజర య్యారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. సెలెక్ట్ జాబితాలో ఉన్న ఇద్దరి ఎంపికను జిల్లా విద్యాశాఖ అధికారులు, కమిటీ సభ్యులు తిరస్కరించారు. చంద్రమౌళి అనేఅభ్యర్థి పీహెచ్‌కింద ఎంపిక జాబితాలో పేరు వచ్చింది. అయితే పరిశీలనకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకు రాకపోవడంతో పరిశీలన కమిటీ అభ్యంతరం చెప్పింది. విషయం డీఈఓ ప్రసాద్ బాబు దృష్టికి రావడంతో ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకువస్తేనే ఆమోదం పొందుతుందని చెప్పి పంపారు.. ఆయన తిరిగి పరిశీలనకు రాకపోవడంతో ఎంపిక అభ్యర్థిత్వాన్ని తిరస్కరించారు. మరో అభ్యర్థి వెంకటరమణ ఇప్పటికే స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తుండగా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌గా ఎంపికఅయ్యారు. నిబంధనల మేరకు ఆయన సర్టిఫికెట్లు చూపించకపోవడంతో తిరస్కరించినట్లు డీఈఓ తెలిపారు. శ్రీనివాసులు అనే అభ్యర్థి పీహెచ్ కోటాలోనే ఎంపికకాగా, ఒరిజనల్ సర్టిఫికెట్లకు సంబంధిత ఆస్పత్రినుంచి రాలేదని చెప్పడంతో ఆయనకు సోమవారం వరకు అవకాశం ఇచ్చారు.

● మరో జాబితా కోసం నిరీక్షణ

జిల్లాలో 807 టీచర్ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల కావాల్సి ఉంది. అయితే ఇప్పటికి 757మందిజాబితా మాత్రమే రావడం జరిగింది. ఇంకా 50మంది అభ్యర్థుల సెలెక్ట్ జాబితా రావాల్సి ఉంది. శనివారం కూడా విడుదల కాలేదు. సోమవారం ఈజాబితా వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చెబుతోంది.



డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న కమిటీ సభ్యులు

పల్లె ఉమాకు ఘన నివాళి

కుటుంబ సభ్యులతో పాటు వివిధ పార్టీల నాయకుల శ్రద్ధాంజలి

అనంతపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి సతీమణి పల్లె ఉమాకు కుటుంబ సభ్యులతో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులు నివాళులర్పించారు. మండలంలోని కక్కలపల్లి సమీపంలోని పల్లె వ్యవసాయ క్షేత్రంలో పల్లె ఉమా ఘాట్ వద్ద శనివారం ఏడో వర్ధంతి నిర్వహించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, మనవడు, మనవరాలు వియాన్, వన్యా, వియ్యంకులు కేరళ మాజీ డీజీపీ శంకర్‌రెడ్డి, ఆయన సతీమణి సౌభాగ్యరాణి, పీవీకేకే యాజమాన్య ప్రతినిధి శ్రీకాంత్‌రెడ్డి తదితర కుటుంబ సభ్యులు ముందుగా పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులు అర్పించారు. వీరితోపాటు ఉమ్మడి జిల్లాలోని కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, బాలాజీ విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున నివాళులు అర్పించారు. పుట్టపర్తి నుంచి పల్లె ఉమా ఘాట్ వరకు టీడీపీ యువ నాయకులు రామ్‌లక్ష్మణ్ ఆధ్వర్యంలో 300మంది యువకులతో బైక్‌ర్యాలీ నిర్వహించారు. అనంతరం పల్లె ఉమాకు నివాళులు అర్పించారు. దీంతో వ్యవసాయ క్షేత్రం జనసంద్రంగా మారింది.



నివాళులు అర్పిస్తున్న పల్లె రఘునాథరెడ్డి, ఎంపీ బీకే, ఎమ్మెల్యేలు అమిలినేని, పల్లె సింధూర, పల్లె కిశోర్, టీడీపీ నాయకులు

ఎంపీ, ఎమ్మెల్యేలు, ప్రతిపక్షపార్టీ నేతలు హాజరు

పల్లె ఉమాకు ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యేలు అమిలినేని సురేంద్ర బాబు, ఎమ్మెస్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి నివాళులు అర్పించారు. వీరితోపాటు ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ నెట్టెం వెంకటేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, నగర మాజీ మేయర్ స్వరూప, డిప్యూటీ మేయర్ గంపన్న, సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు నారాయణస్వామి, వేమయ్య యాదవ్, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు జగదీష్, జాఫర్, కేశవరెడ్డి, శ్రీరాములు, సీపీఎం రాష్ట్ర నాయకులు రాంభూపాల్, పెద్దిరెడ్డి, నాగేంద్ర, ప్రముఖ వైద్యులు సుధీంద్ర, రామ్మోహన్, రాంప్రసాద్, ఏపీపీఎస్సీ మాజీ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు నివాళులు అర్పించారు.



పల్లె ఉమా ఘాట్ వద్ద నివాళులు అర్పిస్తున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కుటుంబ సభ్యులు

మెగా రక్తదాన శిబిరం

పల్లె ఉమా వర్ధంతిని పురస్కరించుకుని వ్యవసాయ క్షేత్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. పుట్టపర్తి నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యాసంస్థల ఉద్యోగులు, సిబ్బంది పెద్ద ఎత్తున రక్తదానం చేశారు. పల్లె ఉమా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యాసంస్థలోని సిబ్బంది, కార్మికులకు వస్త్రదానం చేశారు. విద్యాసంస్థల ప్రిన్సిపాళ్ల ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అనురాగ్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు సుబ్బారావు, మన్మథేశ్వర్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు, శర్మ, రాఘవేంద్ర, ప్రకాష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి



పరిటాలరవి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ తదితరులు

రామగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దివంగత పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలు మండలంలోని వెంకటాపురంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆధ్వర్యంలో కుమారులు పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ, కోడళ్లు పరిటాల జ్ఞాన, పరిటాల తేజస్వినిలతో పాటు ఇతర కుటుంబ సభ్యులు పరిటాల రవీంద్ర ఘాట్‌కు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. సమీప గ్రామాల నుంచి తరలివచ్చిన అభిమానులు, కుటుంబ సభ్యులు నివాళులర్పించిన అనంతరం ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అన్నదాన చేశారు. మండలంలో కూడా పలు చోట్ల పరిటాల రవీంద్రజయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. రామగిరి టీడీపీ కార్యాలయంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

తూతూమంత్రంగా..!

● రోడ్డు పనుల్లో నాణ్యత డొల్ల ● నెల రోజులకే ధ్వంసమైన రహదారులు



ఉండబండ దేవాలయం వద్ద పగిలి పోయిన రోడ్డు

విడపనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పనులు నాణ్యతగా చేయకపోవడంతో రోజుల వ్యవధిలోనే రోడ్లు పాడైపోతున్నాయి. దీంతో కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అవుతోంది. మండలంలోని ఉరవ కొండ నుంచి ఉండబండ మీదుగా పాల్తూరు గ్రామం వెళ్లేందుకు దాదాపుగా 14 కిలో మీటర్లు తారురోడ్డు నిర్మాణానికి రూ. 2.5 కోట్ల నిధులు కేటాయించారు. ఈ రోడ్డు పనులను జూలైలో ప్రారంభించి ఆగస్టులో పూర్తి చేశారు. అయితే రోడ్డు మాత్రం అప్పుడే ఎక్కడ పడితే అక్కడ పగిలిపోయింది. అలాగే ఉరవకొండ-బళ్లారి 42వ జాతీయ రహదారి వద్ద నుంచి పాల్తూరుకు వెళ్లే రోడ్డు పనులు రెండు కిలోమీటర్లు చేశారు. మధ్యలో రెండు కిలోమీటర్లు వైసీపీ ప్రభుత్వంలో చేయటంతో వాటిని వదిలేసి ఉండబండ ఆలయం వరకూ దాదాపుగా ఆరు కిలో మీటర్లు తారు రోడ్డు పనులు చేశారు. మధ్యలో అక్కడక్కడ ధ్వంసమైన పాత రోడ్డును తొలగించి పాల్తూరు నుంచి పనులు చేపట్టారు. ఉరవకొండ నుంచి ఉండబండ వరకూ తారు రోడ్డు పనులు పూర్తి చేశారు. తిరిగి పాల్తూరు నుంచి ఉండబండ వరకూ ఎదురు రోడ్డు వేసుకుంటూ వస్తున్నారు. ఇటు వైపు వేసిన రోడ్డు అప్పుడే శిథిలమై పాత రోడ్డును తలిపిస్తోంది. అధికారులు పట్టించుకోకపోవడం వల్లే పనుల్లో నాణ్యత లోపిస్తోందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

● ఈ విషయమై ఆర్అండ్‌బీ ఎఈ నాగభూషణంను వివరణ కోరగా రోడ్డు వేసిన వెంటనే 15 రోజులు వర్షాలు రావటంతో పగిలిందని అన్నారు. దీనికి తోడు పెద్ద పెద్ద వాహనాలు రోడ్డుపై వెళ్తూ ఉండటం కూడా ధ్వంసమవడానికి కారణమన్నారు. పాల్తూరు నుంచి రోడ్డు వేస్తూ వస్తున్నారు. దీనిపై మళ్లీ రోడ్డు వేయిస్తామని తెలిపారు.



మారెమ్మ గుడి నుంచి వంద మీటర్లకు పైగా ఇలా పగిలిపోయింది..



ర్యాలీగా వస్తున్న మంత్రి సవిత, పరిటాల కుటుంబం, ఎమ్మెల్యేలు



అభివాదం చేస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్, సిద్ధార్థ

పేదల గుండె ధైర్యం పరిటాల

రవి రాకతో ప్రజల్లో ధైర్యం: ఎంపీ బీకే పార్థసారథి

అనంతపురం జిల్లాలో 1993లో అరాచకాలు ఎక్కువగా ఉండేవి. పెనుకొండలో పోటీ చేయడానికి ఎవరూ ముందుకు రాని సమయంలో ఎన్టీఆర్ పరిటాల రవీంద్రను తీసుకొచ్చారు. ఆయన రాకతో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చారు. ఆయనకు అండగా నిలిచి ఎన్నికల్లో గెలిపించారు. బడుగు బలహీనవర్గాలు రాజకీయంగా ఎదగడానికి ఆయన ఎంతో కృషి చేశారు. అందులో నేనూ ఒకడిని.

కల నెరవేరింది: ఎమ్మెల్యే పరిటాల సునీత

నందమూరి తారక రామారావు ఆశయాలతో జిల్లాలో పెత్తందారులను తొక్కడానికి వచ్చిన నాయకుడు పరిటాల రవీంద్ర. నా భర్త మరణానంతరం నాకు రాజకీయం నేర్పించిన దేవుళ్లు పెనుకొండ ప్రజలు. పరిటాల కుటుంబం ఉన్నంతవరకు ఈ నియోజకవర్గ ప్రజలను మరిచిపోము. సీనియర్ నాయకుల అండతో అన్ని రకాలుగా అభివృద్ధి చేశాను. మాకు రాజకీయ భిక్ష పెట్టింది మొదట ఎన్టీఆర్, ఆ తరువాత పెనుకొండ ప్రజలు. పరిటాల రవి ఎనిమిది అడుగుల కాంస్య విగ్రహం ఏర్పాటు చేసిన మంత్రి సవితకు మా కుటుంబం అండగా ఉంటుంది. ఇక్కడ పరిటాల రవీంద్ర విగ్రహం ఉండాలన్నది నా చిరకాల కోరిక. నేడు నెరవేరింది.

(5వ పేజీ తరువాయి)

అభివృద్ధి కోసం అహర్నిశలు కృషిచేశారని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి సవితను పరిటాల కుటుంబం ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కురుబ కృష్ణమూర్తి, గుట్టూరు సూరి, మావటూరు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేస్తాం

కళ్యాణదుర్గంలో పరిటాల రవీంద్ర విగ్రహాన్ని ఏర్పాటు చేస్తాం. పరిటాల కుటుంబంతో మాకు చాలా సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఆయనకు రాష్ట్రంలోనే కాకుండా పలుదేశాల్లో అభిమానులు ఉన్నారు. ఆయన మరణానంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట పరిటాల సునీత నామినేషన్ కోసం పలువురు ప్రాణాలు అర్పించారు. పరిటాల సునీత గెలుపుకోసం ప్రతి కార్యకర్త ఒక అల్లూరి సీతారామరాజు అయ్యారు.

- ఎమ్మెల్యే అలిమినేని సురేంద్ర

ప్రత్యర్థుల గుండెల్లో సింహస్వప్నం

ప్రత్యర్థుల గుండెల్లో పరిటాల రవీంద్ర సింహస్వప్నం. పేదలకు, అభాగ్యులకు, బాధితులకు అండగా ఉన్న నాయకుడు ఆయన. రాజకీయ చరిత్రలో తిరుగులేని నాయకుడు. ఈ జిల్లాలో ఎందరో మంత్రులు, ఎమ్మెల్యేలు అయి ఉంటారు. కానీ పరిటాల రవి రాసిన చరిత్రను మార్చలేరు. కొంతమంది కుటుంబం కోసం పుడతారు. కొంతమంది ప్రజల కోసం పుడతారు. చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయేవారు అతికొద్ది మంది ఉంటారు. వారిలో పరిటాల రవీంద్ర ఒకరు.

- ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గర్వకారణం

పేద, బడుగు, బలహీనవర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పరిటాల రవీంద్ర. కరువు జిల్లా అనంతలో ఆయన పుట్టడం జిల్లాకు గర్వకారణం. తెలుగుదేశం పార్టీలో పరిటాల రవి ఉండటం గర్వకారణమని అప్పట్లో ఎన్టీఆర్ అన్నారు. మంత్రి సవిత పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయం.

- జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట ఆంజనేయులు

మీ రుణం తీర్చుకోలేం: పరిటాల శ్రీరామ్

పరిటాల కుటుంబం రాజకీయాల్లోకి వచ్చిన వెంటనే పెనుకొండ ప్రజలు అన్నివిధాలుగా అండగా నిలిచారు. మా విజయానికి, రాజకీయంగా నిలదొక్కుకునేందుకు కృషి చేశారు. పెనుకొండ ప్రజల రుణం తీర్చుకోలేనిది. పెనుకొండ అంటేనే పరిటాల అని ఎక్కడికెళ్లినా గుర్తు చేస్తారు. పెనుకొండ ప్రజల త్యాగాలు, వారి భిక్షతోనే ఈ రోజు రాజకీయాలు చేయగలుగుతున్నాం. మా తల్లి నామినేషన్‌ను మరిచిపోలేము. మృతదేహాలపై నడిచివెళ్లి నామినేషన్ వేశాము. అలాంటి సమయంలో కూడా మాకు అండగా నిలబడ్డారు.

క్రైం కార్నర్

అప్పులకు చేనేత కార్మికుడి బలి


రమేష్ (ఫైల్)

బత్తలపల్లి ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో మండలంలోని ఎం. చెర్లోపల్లి గ్రామానికి చెందిన చిట్రా రమేష్ (34) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ సోమశేఖర్ తెలిపారు. రమేష్ గత 15 సంవత్సరాలుగా సొంతమగ్గం నేస్తూ జీవించేవాడు. నేసిన చీరలకు గిట్టుబాటు ధర రాక, అప్పులతో నెట్టుకొచ్చాడు. పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చేదంటూ భార్యతో తరచూ మథనపడేవాడు. ఈ నేపథ్యంలోనే తీవ్రంగా మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి రూ.10లక్షలు అప్పులు ఉన్నట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైతు ఆత్మహత్య

డీ.హీరేహాళ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన మండలంలోని పులకుర్తి గ్రామానికి చెందిన రైతు కృష్ణారెడ్డి(62) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన మేరకు కృష్ణారెడ్డి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా కృష్ణారెడ్డి ఆరోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 26న ఇంట్లో ఉన్న క్రిమి సంహారక మందుని తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు చికిత్స కోసం బళ్లారి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడు కృష్ణారెడ్డికి భార్య అనంతలక్ష్మి, కుమారుడు దేవరెడ్డి, కుమార్తె ఉన్నారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు.

ఆటో డ్రైవర్..

గార్లదిన్నె, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లూరు గ్రామ స్టేట్ బ్యాంకు సమీపంలో శుక్రవారం రాత్రి ఆటో డ్రైవర్ వడ్డే రాజశేఖర్ (32) ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు వడ్డే రాజశేఖర్ ఆటో డ్రైవర్‌గా పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకునేవాడు. గత కొద్దిరోజుల నుంచి మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవ పడుతుండేవాడు. ఈక్రమంలోనే శుక్రవారం రాత్రి భార్యతో గొడవ పడ్డాడు. తీవ్ర మనస్తాపం చెంది శనివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య వడ్డే రాశి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రూ.ఐదు లక్షలు చోరీ

గాండ్లపెంట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడ్డివెలగల పంచాయతీలోని పల్లెవాండ్లపల్లి గ్రామంలో రూ.ఐదు లక్షలు చోరీ అయినట్లు పోలీసులు శనివారం తెలిపారు. వారు తెలిపిన మేరకు పల్లెవాండ్లపల్లిలో నివాసముంటున్న వాసుదేవ పశువులు మేపుకుంటూ జీవిస్తున్నాడు. పశువులు, పేడ అమ్ముకుని రూ. ఐదులక్షలు జమ చేసుకుని, డబ్బుని ఇంట్లోని బీరువాలో దాచుకున్నాడు. రోజులాగానే శుక్రవారం మధ్యాహ్నం 12గంటల సమయంలో పశువులను మేతకు తోలుకెళ్లాడు. సాయంత్రం 7గంటలకు వచ్చి చూసే సరికి ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాను తెరచి, అందులో ఉన్న డబ్బు మొత్తం చో చేశారు. ఈవిషయంపై శనివారం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. ఆయన ఫిర్యాదు మేరకు డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీమ్ తో పరిశీలించామన్నారు.

రాయంపల్లిలో...

రాయదుర్గంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లి గ్రామంలో తిప్పేస్వామి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. తిప్పేస్వామి డి.హీరేహాళ్‌లోనే ఉంటూ ఓ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. వారానికోసారి రాయంపల్లికి వచ్చి వెళ్లేవాడు. దీంతో ఇంట్లో ఒక్కతే ఉండలేని అతడి భార్య వరలక్ష్మి గ్రామంలోనే ఉండే పుట్టింటికి వెళ్లేది. ఈనేపథ్యంలో తిప్పేస్వామి శుక్రవారం విధులకు వెళ్లిపోయాడు. యథాప్రకారం వరలక్ష్మి ఇంటికి తాళం వేసుకుని పుట్టింటికి వెళ్లింది. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం అర్ధరాత్రి వాకిలి తాళాలు పగులగొట్టి ఇంట్లో చొరబడ్డారు. బీరువాను పగులగొట్టి అందులో ఉన్న రెండున్నర తులాల బంగారం, రూ. 10 వేల నగదు, ఒక సెల్‌ఫోన్‌ను చోరీ చేసినట్లు బాధితురాలు వరలక్ష్మి తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

దొంగతనం కేసు నిందితుడి అరెస్టు

పుట్లూరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు అలవాటుపడి దొంగగా మారిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యబాబు శనివారం విలేకరులకు వెల్లడించారు. అయన మాట్లాడుతూ ఈనెల 22న పుట్లూరు బీసీకాలనీలో బాలన్న ఇంటిలో చోరీ జరిగింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామన్నారు. పాత నేరస్థుల డేటా ఆధారంగా విచారించగా అదే గ్రామానికి చెందిన బాలచంద్ర అలియాస్ బాలును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. విచారణలో అతడు నేరం ఒప్పుకున్నట్లు తెలిపారు. అతడి నుంచి మూడు జతల బంగారు కమ్మలు, 8గ్రాముల బంగారం చైన్, రెండు బంగారు ఉంగరాలు, 25తులాల వెండి గొలుసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈనెల 15న పుట్లూరు బస్టాండ్ ఆవరణలో ఉన్న కిరాణా షాపులో రూ.7450 దొంగతనం చేయగా రికవరీ చేశామన్నారు. నిందితున్ని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

యువతి తండ్రిపై కొడవలితో దాడి

నార్పల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సూర్యనగర్ కాలనీలో నివాసముంటున్న యువకుడు హేమేష్‌కుమార్ అదే కాలనీకి చెందిన వ్యక్తిపై శనివారం కొడవలితో దాడి చేశాడు. బాధితుడి కుమార్తెను హేమేష్‌కుమార్ ప్రేమ పేరుతో వేధించేవాడు. ఆ అమ్మాయి ఇంటి వైపు బైక్‌లో తిరిగేవాడు. ఇది గమనించిన ఆమె తండ్రి హేమేష్‌కుమార్‌ను మందలించాడు. దీంతో కోపోద్రిక్తుడైన హేమేష్‌కుమార్ కొడవలితో దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువతి తండ్రిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ సాగర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళపై కత్తితో..

మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో జమీలా అనే మహిళపై లక్ష్మిరెడ్డి అనే యువకుడు శనివారం కత్తితో దాడిచేసి పరారయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు జమీలా భర్తతో విడాకులు తీసుకుని గత కొద్ది రోజులుగా వెంకటాంపల్లిలో తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈక్రమంలోనే శనివారం మధ్యాహ్నం జమీలా పొలం వద్దకు వెళ్లింది. వెంబడించిన లక్ష్మిరెడ్డి ఆమెపై కత్తితో దాడిచేసి పారిపోయాడు. గాయపడిన ఆమెను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. దాడి చేసిన లక్ష్మిరెడ్డి కోసం పోలీసులు గాలిస్తున్నారు. కాగా ఆ మహిళపై లక్ష్మిరెడ్డి ఎందుకు దాడిచేశాడనే విషయంపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

వినాయక నిమజ్జనంలో అపశ్రుతి

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని గువ్వలగుట్టపల్లిలో వినాయక నిమజ్జనం సందర్భంగా అపశ్రుతి చోటుచేసుకుంది. విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతిచెందాడు. వినాయడి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు వెళుతుండగా... ట్రాక్టర్‌పై ఉన్న గ్రామానికి చెందిన నరసింహమూర్తి(40) ఒక పచ్చి కర్ర తీసుకుని స్థానిక చెరువు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలను విగ్రహానికి తగలకుండా పైకి ఎత్తే ప్రయత్నం చేశాడు. ఈ సమయంలో అతడు విద్యుదాఘాతమై అక్కడికక్కడే మృతిచెందాడని గ్రామస్థులు, పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కుటుంబ యజమాని మృత్యువాత పడటంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి.

భూ సేకరణపై దృష్టి సారించాలి: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఏజెంట్ స్పేస్(ఈటీపీఎ్స)లో డాక్యుమెంట్ అప్లోడ్, పీఎం కుసుమ్ యోజనలో భాగంగా పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు సంబంధించి భూ సేకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో డీఆర్ఓ మలోల, ఇతర అధికారులతో కలిసి ఆయన శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ పీఎం కుసుమ్ యోజన ఆవశ్యకత గురించి వివరించారు. ఈ పథకం ద్వారా రైతులు పంటలు సాగు చేయడానికి సౌర శక్తిని ఉపయోగించుకునే వీలు కలుగుతుందన్నారు. వ్యవసాయ పద్ధతుల్లో అనేక మార్పులు, ప్రయోజనాలు పొందేందుకు ఇది ఎంతో దోహదపడుతుందన్నారు. ఐదు కిలోమీటర్ల దగ్గరగా ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ ఉన్న చోట భూసేకరణ పనులు చేపట్టాలన్నారు. కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లు నాణ్యతగా లోపాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఏజెంట్ స్పేజ్ ఈటీపీఎస్ పోర్టల్‌లో సంబంధిత శాఖలకు చెందిన పలు డాక్యుమెంట్లు అప్లోడ్ పనులను జాగ్రత్తగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.


వస్తున్నా.. కాస్కో..


దుమ్ము రేగాల్సిందే..

రయ్ రయ్.. రేస్..!

- కొండ ప్రాంతాల్లో కార్లు.. బైక్‌ల సందడి
- పుట్లూరు.. నార్పల నడుమ దుమ్ము రేపే ఆట

పుట్లూరు, నార్పల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పుట్లూరు మండలం మడుగుపల్లి గ్రామ శివారులో బైకు, కార్ రేస్ పోటీలు జరుగుతున్నాయి. 'దక్షిణ్ డేర్ క్రాస్ కంట్రీ ర్యాలీ అండ్ బైక్ రేస్' పేరిట ఈ పోటీలను మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. పుట్లూరు మండలం నుంచి నార్పల మండలం వరకూ ఉన్న కొండ ప్రాంతాల్లో జరుగుతున్న బైక్, కార్ రేస్‌ను చూసేందుకు జనం ఆసక్తిగా తరలివచ్చారు. ఏపీ, తెలంగాణ, గోవా, తమిళనాడు, కేరళ, కర్ణాటక తదితర రాష్ట్రాల రేసర్లు శనివారం జరిగిన పోటీల్లో పాల్గొన్నారు. జిల్లాలో మూడు రోజులపాటు ఈ పోటీలను నిర్వహించేందుకు కలెక్టర్ వినోద్ కుమార్, ఎస్పీ జగదీష్ అనుమతి ఇచ్చారు.

అదుపుతప్పిన కార్లు

పుట్లూరు మండలం మడుగుపల్లి శివారులో రేస్‌లో పాల్గొన్న ఓ కారు శనివారం అదుపుతప్పింది. బెంగళూరుకు చెందిన ఓ కంపెనీ కారు మలుపు వద్ద వేగాన్ని నియంత్రించలేక కొండకిందకు ఒరిగింది. రేసర్ అలాగే బ్రేక్ వేసి నిలబెట్టారు. వెనుక వస్తున్న కార్లు వెళ్లాక సిబ్బంది వచ్చి మరో కారు సాయంతో బయటకు లాగారు. మరో రెండు ప్రాంతాల్లోనూ కార్లు అదుపు తప్పాయి. ఎవరికీ గాయాలు కాలేదు. పుట్లూరుకు బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని రేస్‌లో పాల్గొన్న బైకు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి బైక్ రైడర్ రూ.లక్ష పరిహారం ఇచ్చారని తెలిసింది.


మడుగుపల్లి కొండలో అదుపుతప్పిన కారు

డీఎంఈగా డాక్టర్ రఘునందన్

- అంచెలంచెలుగా ఎదిగిన అనంత విద్యార్థి
- గుత్తిలో పాఠశాల విద్య.. తిరుపతిలో వైద్య విద్య



అనంతపురం వైద్యం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అనంత విద్యార్థి, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ రఘునందన్ రాష్ట్ర వైద్యవిద్య డైరెక్టర్‌గా(డీఎంఈ) నియమితులయ్యారు. ఆయన తల్లి వసంతలక్ష్మి గుత్తి పట్టణానికి చెందినవారు. తండ్రి డాక్టర్ గోపాల్‌కృష్ణ కర్నూలుకు చెందినవారు. డాక్టర్ గోపాల్‌కృష్ణ ఎస్వీ మెడికల్ కాలేజీలో ఫార్మాకాలజీ ప్రొఫెసర్‌గా సేవలందించి రిటైర్డ్ అయ్యారు. డాక్టర్ రఘునందన్ గుత్తి హైస్కూల్‌లో చదువుకున్నారు. కర్నూలులో ఇంటర్ పూర్తిచేశారు. ఎంబీబీఎస్, ఎంఎస్ తిరుపతిలో అభ్యసించారు. 1994లో డాక్టర్‌గా కడపలో సేవలను ప్రారంభించారు. నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం వైద్య కళాశాలల్లో సేవలందించారు. ఆయన భార్య మచిలీపట్నం మెడికల్ కాలేజీలో ఆప్తాలమిక్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. డాక్టర్ రఘునందన్‌కు అనంతపురం ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఆర్థో విభాగాధిపతిగా, సూపరింటెండెంట్‌గా పనిచేశారు. అకడమిక్ డీఎంగా పదోన్నతిపై విజయవాడకు వెళ్లారు. పెద్దాస్పత్రిలో ఏర్పాటు చేసిన మదర్స్ మిల్క్ బ్యాంక్ ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. డీఎంఈ పోస్టుకు అనేక మంది పోటీ పడ్డారు. కానీ ప్రభుత్వం ప్రతిభకు పట్టం కట్టిందని వైద్య వర్గాలు అంటున్నాయి. డీఎంఈగా డాక్టర్ రఘునందన్ నియామకంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియ, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శంకర్, డాక్టర్ మధు, విభాగాధిపతులు డాక్టర్ శంకర్‌నాయక్, డాక్టర్ శాంతిరెడ్డి, డాక్టర్ దుర్గ, డాక్టర్ ఉమామహేష్, డాక్టర్ సరళ హర్షం వ్యక్తంచేశారు. సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్, విభాగాధిపతులు డాక్టర్ రామస్వామినాయక్, డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ భీమసేనాచార్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ భవాని, డాక్టర్ రాజేష్, డాక్టర్ మధుసూన్, డాక్టర్ సురేష్, పరిపాలనా విభాగం అధికారులు డాక్టర్ శ్రీనివాస్ శౌరి, డాక్టర్ సౌజన్య కుమార్, ఆర్ఎంఓలు డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ హేమలత, డాక్టర్ శివకుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు.

చెప్పిన దారిలోనే వెళ్లండి..!

(5వ పేజీ తరువాయి)

క్లాక్ టవర్, పీటీసీ, నడిమివంక మీదుగా సాగాలి.

రూట్ -3: రుద్రంపేట, రామ్‌నగర్, లక్ష్మీనగర్, శ్రీనగర్ కాలనీ వైపు నుంచి వచ్చే విగ్రహాలు రామ్‌నగర్ ఫ్లై ఓవర్ మీదుగా ప్రభుత్వాసుపత్రి, తెలుగుతల్లి కూడలి, అంబేడ్కర్ సర్కిల్ మీదుగా సప్తగిరి సర్కిల్‌లోకి చేరుకోవాలి.

ఈ ప్రాంతాల్లో నిమజ్జనం: విగ్రహాలను మూడు ప్రాంతాల్లో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. నాలుగు అడుగుల కంటే ఎక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను ఆత్మకూరు మండలం పంపనూరు వద్ద హంద్రీనీవా కాలువలో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. అంత కంటే తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను అనంతపురం రూరల్ మండలం రాచానపల్లి చెక్ డ్యామ్ వద్ద, రాచానపల్లి పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుంది.

ట్రాఫిక్ ఆంక్షలు: గణేష్ శోభాయాత్ర, నిమజ్జనం నేపథ్యంలో అనంతపురం నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అర్బన్ డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సోమవారం ఉదయం 7 గంటల వరకూ లారీ, ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ బస్సులు, ఇతర భారీ వాహనాలు నిర్దేశించిన రూట్లలో నగరంలోకి ప్రవేశించాలని సూచించారు. తపోవనం సర్కిల్ నుంచి హైవే మీదుగా తడకలేరు, మార్కెట్ యార్డ్, మిర్చి యార్డ్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వైపు సాగాలని అన్నారు. నగరంలోని రవి పెట్రోల్ బంక్ నుంచి బెంగళూరు హైవే వైపు, రుద్రంపేట సర్వీస్ రోడ్డులోని రాజహంస అపార్టుమెంట్ నుంచి హైదరాబాద్ హైవే వైపు, పంగల్‌రోడ్డు నుంచి రాప్తాడు నేషనల్ హైవే వైపు, కలెక్టరేట్ నుంచి చెరువుకట్ట మీదుగా ఎన్టీఆర్ మార్గ్, తాడిపత్రి వైపు, మేడా పెట్రోల్ బంకు, గుత్తిరోడ్డు నుంచి ఎన్టీఆర్ మార్గ్ మీదుగా తాడిపత్రి వైపు వెళ్లవచ్చునని తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి చంద్ర హాస్పిటల్ సర్కిల్ మీదుగా మిర్చియార్డ్, గుత్తిరోడ్డు, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా కదిరి, ధర్మవరం వెళ్లవచ్చునని తెలిపారు.

ఉచిత డ్రైవింగ్ శిక్షణ

అనంతపురం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కియ, సంభవ్ ఫౌండేషన్ సంయుక్తంగా ఉచిత డ్రైవింగ్ శిక్షణ ఇస్తున్నట్లు సంభవ్ ఫౌండేషన్ ఇన్‌చార్జ్ గంగాధర్ తెలిపారు. శనివారం అనంతపురం డిపో ఆవరణలో ఉచిత డ్రైవింగ్ శిక్షణ బ్యాచ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 20 నుంచి 35 సంవత్సరాలలోపు ఉన్న నిరుద్యోగ యువత ఎల్ఎంవీ లైసెన్స్ కలిగినవారు ఇందుకు అర్హులన్నారు. శిక్షణా కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగం వచ్చే వరకూ తమ ఫౌండేషన్ బాధ్యత వహిస్తుందన్నారు. అనంతరం కియ ప్రతినిధి రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది నిరుద్యోగులకు డ్రైవింగ్ శిక్షణ ఇప్పించి, ఉద్యోగాలు కల్పించామన్నారు. ఉచిత డ్రైవింగ్ శిక్షణకు వచ్చే అభ్యర్థులకు ప్రతిరోజు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 40 రోజుల పాటు తరగతులు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ టెక్నికల్ అసిస్టెంట్ నారాయణ, ట్రైనర్ అమృత్‌బాషా, సంభవ్ ఫౌండేషన్ మధుసూదన్, జాహిద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బార్‌లకు లక్కీడ్రా

- దక్కించుకున్నవారికి ధ్రువపత్రాలు

అనంతపురం క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బార్ లైసెన్స్‌లకు అధికారులు శనివారం లాటరీ తీశారు. జడ్పీ డీపీఆర్సీ భవనంలో అనంతపురం, పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శ్రీసత్యసాయి జిల్లా లాటరీలను తీశారు. అనంతపురం జిల్లాలోని 10 ఓపెన్ కేటగిరీ బార్లకు 40 దరఖాస్తులు, గీత కులాల బార్లకు 10 దరఖాస్తులు వచ్చాయి. అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగ మద్దయ్య, ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో డ్రా తీశారు. ఎంపికైనవారికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు సత్యనారాయణ, నాయుడు, శివసాగర్, ఇన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జయనాథరెడ్డి, ఎస్ఐలు జయనరసింహ, జాకీర్‌హుస్సేన్, కృష్ణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు. శ్రీసత్యసాయి జిల్లాలో 12 బార్‌లకు దరఖాస్తులు ఆహ్వానించగా, ఏడింటికే దరఖాస్తులు వచ్చాయి. సాయి ఆరామంలో కలెక్టర్ టీఎస్ చేతన్ లాటరీ తీశారు. హిందూపురంలో గీత కులాలకు కేటాయించిన బార్‌తో కలిపి మూడు బార్లు, కదిరిలో రెండు, ధర్మవరం, పెనుకొండ మున్సిపాలిటీల్లో ఒక్కో బార్‌కు లాటరీ తీశారు. లైసెన్స్ దక్కించుకున్నవారికి ఎక్సైజ్ శాఖ అధికారులు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ గోవిందునాయక్, ఏఈఎస్ నరసింహులు పాల్గొన్నారు.

ఆక్రమణదారులపై కేసు పెట్టండి

- అగ్రిగోల్డ్ భూములపై సీపీఐ నాయకులు

కూడేరు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమ్మూరు గ్రామ సమీపంలోని అగ్రిగోల్డ్ భూములను ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శనివారం ఆ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ సీఐడీ అటాచ్‌లో ఉన్న అగ్రిగోల్డ్ భూములను రాజగోపాల్‌రెడ్డి, సాకే అభిజ్ఞ ఆక్రమించారని తక్షణం వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు 252 ఎకరాల్లో ప్లాట్లు వేయగా, ఆక్రమణదారులు ప్రధాన రహదారికి అనుకొని ఉన్న ప్లాట్లను ఆక్రమించి అక్కడున్న భవనంతోపాటు కాంపౌండ్ వాల్ ధ్వంసం చేశారన్నారు. అగ్రిగోల్డ్ సంస్థకు చెందిన వేల కోట్ల ఆస్తులు సీఐడీ అటాచ్‌లో ఉంటే కొందరు వైసీపీ నాయకులు అక్రమంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారని ఆరోపించారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర గార్డెన్ డెవలపర్ పేరుతో ఉన్న 22 ఎకరాల భూమిని 2014లో రాజగోపాల్ రెడ్డి పేరుతో కొనుగోలు చేశారన్నారు. ఆ భూమి మొత్తం సీఐడీ అటాచ్‌లో ఉందని, అయినా 2023లో అభిజ్ఞ పేరుతో రిజిస్ట్రేషన్ పుట్టించారన్నారు. దీనికి తోడు వంకభూములను సైతం రిజిస్ట్రేషన్ చేశారని, రెవెన్యూ అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌కు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కేశవరెడ్డి, మల్లికార్జున, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర నాయకులు సిద్దేశ్వర, నారాయణప్ప, కుళ్లాయప్ప, పెరుగు సంగప్ప పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లపై ప్రజాభిప్రాయ సేకరణ

- మున్సిపల్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అన్న క్యాంటీన్ల నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని మున్సిపల్ శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ సురేష్‌కుమార్ ఆదేశించారు. రాజధాని అమరావతి నుంచి సీడీఎంఏ సంపత్‌కుమార్‌తో కలిసి ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీల కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు. అనంత నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామి, ఎంహెచ్ఓ రంగస్వామి, ఎస్ఈ రాజశేఖర్, ఈఈలు, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ విభాగాల అధికారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలోని 12 మున్సిపాలిటీలలో ఆస్తి నీటి పన్ను వసూళ్లలో అవకతవకలు నివారించి, సక్రమంగా వసూలు చేపట్టాలని ఆదేశించారు. 17 మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఆస్తి క్రయ, విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే మ్యుటేషన్ చేస్తారని తెలిపారు. ఇక రిజిస్ట్రేషన్, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని ఆటోమేటిక్ మ్యుటేషన్ జరుగుతుందని పేర్కొన్నారు. అన్నక్యాంటీన్ల నిర్వహణపై ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టి, మరింత మెరుగ్గా నిర్వహించాలని ఆదేశించారు. నక్ష జియో ట్యాగింగ్ సర్వే నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధం అమలు పక్కాగా అమలు చేయాలని సూచించారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో అనంత నగరపాలక సంస్థ కమిషనర్, అధికారులు

క్రీడలతో క్రమశిక్షణ: ఎస్కేయూ వీసీ

అనంతపురంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): క్రీడలు విద్యార్థుల క్రమశిక్షణలో ప్రధాన పాత్ర పోషిస్తాయని ఎస్కేయూ వీసీ ఆచార్య అనిత అన్నారు. వర్సిటీలో వ్యాయమ విద్య జనరల్ బాడీ సమావేశం శనివారం నిర్వహించారు. వీసీ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకట్‌నాయుడు హాజరయ్యారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, శారీరక దృఢత్వం పెంపొందించడంలో ఆటలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనేలా విశ్వవిద్యాలయం ప్రోత్సహిస్తుందన్నారు. అనంతరం క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి, క్రీడాకారులకు సహాయం, విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో క్రీడా కార్యక్రమాల పురోభివృద్ధి పట్ల చర్చించారు. విశ్వవిద్యాలయ క్రీడల పోటీల వేదికను నిర్ణయించారు. గ్రూప్-ఎ పోటీలను ఎస్వీ డిగ్రీకళాశాల, గ్రూప్-బి పోటీలను బీఎస్‌వీజీఎం ప్రభుత్వ కళాశాల కళ్యాణదుర్గం, గ్రూప్-సీ పోటీలను ఎస్ఎస్‌జీఎస్ కళాశాల గుంతకల్లు, అథ్లెటిక్స్ అండ్ ఉమెన్ గేమ్స్ ప్రభుత్వ కళాశాల అటానమస్ అనంతపురం, క్రికెట్ పోటీలను శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం నిర్వహిస్తారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి జెస్సీ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు, ఫైనాన్స్ ఆఫీసర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి బోర్డు మెంబర్ సెక్రటరీగా ప్రభాకర్‌రావు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) సత్యసాయి తాగునీటి పథకానికి సంబంధించిన బోర్డు మెంబర్ సెక్రటరీగా ఎస్ఈ కేడర్ అధికారిని నియమించారు. ఇప్పటి వరకు గ్రామీణ నీటిసరఫరా ఎస్ఈనే సత్యసాయి బోర్డు మెంబర్ సెక్రటరీగా ఉండేవారు. అయితే నూతనంగా ఈఈల నుంచి ఎస్ఈ ప్రమోషన్లలో భాగంగా పార్వతీపురం గ్రామీణ నీటిసరఫరా ఈఈగా ఉన్న ప్రభాకర్‌రావును సత్యసాయిబోర్డు మెంబర్ సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ గా శ్రీనివాసులు

గ్రామీణ నీటి సరఫరా విభాగంలో డీఈలకు ఈఈలుగా ప్రమోషన్ కల్పించడంతో కర్నూలు జిల్లాలోని కోడుమూరులో గ్రామీణ నీటి సరఫరా విభాగం డీఈగా పని చేస్తున్న శ్రీనివాసులుకు ఈఈగా ప్రమోషన్‌కు అవకాశం ఏర్పడింది. దీంతో క్లియర్ వేకెన్సీ ఉన్న అనంతపురం ఈఈ స్థానానికి నియమించారు. గతంలో పని చేస్తున్న మురళీధర్‌రావు వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకోగా దాన్ని గత జూన్ ఆఖరులో ప్రభుత్వం ఆమోదించింది. అప్పటి నుంచి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఎస్ఈ సురేష్ నిర్వహించారు.

రాయదుర్గం డీఈ శ్రీనివాసులుకు ప్రమోషన్

రాయదుర్గం, సత్యసాయిబోర్డు డీఈగా ఉన్న శ్రీనివాసులకు ఈఈగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో ఆయన్ను పులివెందుల ఈఈగా నియమించారు. దీంతో జిల్లాలో సత్యసాయి బోర్డు డీఈతో పాటు , రాయదుర్గం డీఈ స్థానం కూడా ఖాళీ కానుంది. అయితే ఏఈలకు ప్రమోషన్ కల్పించడం ద్వారా ఆయా స్థానాలను భర్తీ చేయనున్నారు. ఆ ఉత్తర్వులు కూడ మరో వారంలో రానున్నట్లు సమాచారం.

యువతి అదృశ్యం


బొమ్మనహాళ్, ఆగస్టు30, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన 22 ఏళ్ల యువతి అదృశ్యమైనట్లు ఆమె తల్లి శనివారం బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏఎస్ఐ హనుమంతరెడ్డి తెలిపిన మేరకు ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన ఓ యువతి శుక్రవారం సాయంత్రం 4 గంటల నుంచి కనిపించడం లేదని ఆమె తల్లి ఫిర్యాదు చేసిందన్నారు. శనివారం సాయంత్రం వరకు కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు.



లంబోదరుడికి కొనసాగిన పూజలు

అనంతపురం టౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నాలుగోరోజైన శనివారం లంబోదరుడికి పూజలు కొనసాగాయి. నగరంలోని పలు ప్రాంతాల్లో మండపాల వద్ద నిర్వాహకులు ఉదయమే అర్చకుల చేత ప్రత్యేక పూజలు చేయించారు. అలాగే మరికొన్ని చోట్ల గణపతి, శాంతి హోమాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వివిధ రూపాలలో కొలువైన వినాయక ప్రతిమలను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వివిధ మండపాల వద్ద నిర్వాహకులు గణనాథుడి పాటలకు నృత్యాలు చేయడంతోపాటు ఉట్టికొట్టే కార్యక్రమాలను ఎంతో సంబరంగా నిర్వహించారు.


ఎస్వీ థియేటర్ ఎదురుగా వంటమాస్టారుగా గణనాథుడు


అశోక్‌నగర్ ఉర్దూ స్కూల్ వద్ద దక్షిణామూర్తి గణపతి


ఆజాద్‌నగర్ వడ్డే వీధిలో దుర్గా గణపతి



అరుణోదయ కాలనీ, వేణుగోపాల్‌నగర్‌లో కొలువుదీరిన గణనాథుడు


ఐటీ మిట్టపై అర్ధనారీ లింగేశ్వర వినాయకుడు


రహమత్‌నగర్‌లో సెల్ఫీ వినాయకుడు


నాయక్‌నగర్ సిమెంట్ గోడౌన్ వద్ద చాక్లెట్ల వినాయకుడు


నవోదయ కాలనీలో రామావతార గణపతి


హౌసింగ్‌బోర్డు ఈద్గా మైదానం వద్ద కాణిపాక గణపతి


కోవూర్ నగర్‌లో రుద్ర గణపతి



ఎస్వీ థియేటర్ వద్ద ఉట్టి కొడుతున్న యువకులు

దుబ్బార్లపల్లిలో వినాయకుడి లడ్డూల వేలం

● ఐదు లడ్డూలను రూ. 4.07 లక్షలకు దక్కించుకున్న భక్తులు

రామగిరి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుబ్బార్లపల్లి గ్రామంలో వినాయకుడి లడ్డూల వేలం పాటను శనివారం పెద్దఎత్తున నిర్వహించారు. నిమజ్జనం సందర్భంగా గ్రామంలో ఐదు మండపాలలో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాల వద్ద లడ్డూలను గ్రామపెద్దలు వేలం వేశారు. ఇందులో మొదటి మండపం వద్ద బెల్లం నాగరాజు రూ.1.20లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. అదేవిధంగా రెండో మండపం వద్ద దేవజ్జి మౌనిక రూ.85వేలకు, మూడో మండపం వద్ద పోలూరి బాలరంగడు రూ.75వేలకు, నాలుగో మండపం వద్ద పోలూఅంగడి రంగనాయకులు రూ.73వేలకు, ఐదో మండపం వద్ద బెస్త ముత్యాలయ్య రూ.54వేలకు లడ్డూలను వేలంపాటలో దక్కించుకున్నారు. మొత్తం మీద రూ. 4.07లక్షలు వేలం పాటలో వచ్చిందని, ఈ మొత్తాన్ని రాబోవు వినాయక చవితికి వినియోగించనున్నట్టు గ్రామపెద్దలు తెలిపారు.


లడ్డూను దక్కించుకున్న ఆనందంలో బెల్లం నాగరాజు కుటుంబీకులు

యాభై ఎకరాల్లో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్

● కలెక్టర్ వినోద్‌కుమార్ వెల్లడి
● చెన్నంపల్లిలో భూముల పరిశీలన

బుక్కరాయసముద్రం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లి గ్రామంలో యాభై ఎకరాల్లో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటుచేయనున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన జిల్లా సమీక్ష సమావేశంలో ప్లాంట్ ఏర్పాటుకు తగిన భూకేటాయింపు అంశంపై ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ లేవనెత్తారు. రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పవర్‌ప్లాంట్ ఏర్పాటులో జాప్యం నెలకొందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి టీజీ భరత్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై అక్కడిక్కడే స్పందించిన కలెక్టర్ వినోద్‌కుమార్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం చెన్నంపల్లికి చేరుకుని పునరుత్పాదక ఇంధన ఆధారిత పవర్ ప్లాంట్‌కు భూకేటాయింపు ప్రక్రియ ను ప్రారంభించారు. అందుకు సంబంధించిన భూములను పరిశీలించి వాటి వివరాలను రైతులు, రెవెన్యూ అధికారుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. సర్వే నంబర్ 103కు చెందిన 50ఎకరాల్లో 12 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను ఏర్పాటుచేయనున్నట్లు వివరించారు. ఈ మేరకు రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో విద్యుత్ ఎస్ఈ శేషాద్రి, తహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఎంపీడీఓ సాల్మన్, మెగా ఇంజనీరింగ్ ప్రతినిధులు, డీఈఈ రఘు, ఏఈ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


చెన్నంపల్లిలో భూసేకరణపై అధికారులతో మాట్లాడుతున కలెక్టర్

సీమను సస్యశ్యామలం చేయడమే సీఎం ధ్యేయం

● ఎమ్మెల్యే పరిటాల సునీత
● తగరకుంట సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్ద గంగపూజ

కనగానపల్లి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలోని ప్రతి చెరువును నీటితో నింపి ఇక్కడి పంట భూములను సస్యశ్యామలం చేసి రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే సీఎం చంద్రబాబు ధ్యేయమని ఎమ్మెల్యే పరిటాలసునీత అన్నారు. మండలంలోని తగరకుంట గ్రామ సమీపంలో హంద్రీనీవా కాలువలో పారుతున్న జలాలకు శనివారం ఆమె హారతి ఇచ్చి గంగ పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కరువు ప్రాంతమైన రాయలసీమకు కృష్ణాజలాలు తెచ్చేందుకు నాటి ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు హంద్రీనీవా కాలువకు బీజం వేశారని అన్నారు. తదనంతరం ఆ కాలువను పూర్తి చేసి కుప్పంలో ఉన్న చివరి చెరువు వరకు నీరు ఇచ్చి చంద్రబాబు అపరభగీరథుడయ్యారన్నారు. ఈ కాలువ వెంబడి ఉన్న వందల చెరువులు నేడు నీటితో నిండుతున్నాయన్నారు. రైతులు ఆనందంగా పంటలు సాగు చేస్తున్నారన్నారు. ఇక్కడ జీడిపల్లి నుంచి పేరూరుకు పరిటాల రవీంద్ర కాలువను పూర్తి చేసి పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్లు ఏర్పాటు చేసి ఈ ప్రాంతంలో కరువును పారద్రోలుతామని ఆమె పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు అబద్ధాలతో కాలం గడిపి అందరినీ మోసం చేశారని ఈ సందర్భంగా విమర్శించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్, మార్కెట్‌యార్డు చైర్మన్‌లు నెట్టెం వెంకటేశ్, సుధాకర్‌చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, ప్రధాన కార్యదర్శి పతకమూరి అంజి, సర్పంచ్‌లు, నాయకులు మాధవరాజు, అంకే రామకృష్ణ, సోమర చంద్రశేఖర్, రామాంజి, బోదల స్వాతి, బట్టాసురేశ్‌చౌదరి, శ్రీరాము లు, పరంధామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కాలువ వద్ద జలహారతి ఇస్తున్న పరిటాల సునీత

దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులందరికీ పింఛన్లు: ఎమ్మెల్యే

శింగనమల, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దరఖాస్తు చేసుకున్న దివ్యాంగులందరికీ సెప్టెంబరు ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని, ఎవరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శనివారం ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులందరికీ పింఛన్లు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. గత వైసీపీ పాలన నుంచి అడ్డదారుల్లో చాలామంది దివ్యాంగ పింఛన్లు పొందుతున్నారని, అలాంటి వారి పింఛన్ల తొలగింపునకు మాత్రమే ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అన్నారు. నోటీసులు ఇచ్చిన తరువాత ఎంపీడీఓ కార్యాలయంలో సదరం సర్టిఫికెట్ తీసుకెళ్లి మళ్లీ దరఖాస్తు చేసుకున్న ప్రతి దివ్యాంగులకు ఒకటో తేదీన పింఛన్ల ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

గార్లదిన్నె, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దళితులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి వినాయక చవితి వేడుకల్లో ఇరు వర్గాలు దాడులు చేసుకు న్నారు. దీనిపై శనివారం ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానటరింగ్ కమిటీ సభ్యులు బండారు కుళ్లాయప్ప, దళిత సంఘాల నాయకులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషాను కలిసి మాట్లాడారు. శింగనమల సర్కిల్లో వివిధ గ్రామాల్లో గత కొంతకాలం నుంచి దళితులపై దాడులు జరుగుతున్నాయన్నారు. దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు దళితులపైనే కౌంటర్ కేసు నమోదు చేస్తామని భయపెట్టడం బాధాకరమన్నారు. దళితులపై దాడులు చేసిన వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సీఐ, ఎస్ఐలకు అందచేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు కదిరప్ప, భారతీయ భీమ్ సేన నాయకులు రామాంజినేయులు, ఓబులేసు, రాజు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలో సీఎంఈ జోనల్ సదస్సు

అనంతపురం వైద్యం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక వైద్య కళాశాలలో శనివారం నిరంతర వైద్య విద్య(సీఎంఈ) జోనల్ సదస్సును నిర్వహించారు. 'క్లీనికల్ మైక్రోబయాలజీలో సాంప్రదాయ, స్వయంచాలక ఔషధ గ్రహణశీలత' అనే అంశంపై ఏర్పాటుచేసిన సదస్సుకు మైక్రోబయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ శాంతిరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిలుగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియ, సీఎంఈ జోనల్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ సరళ, డాక్టర్ పద్మశ్రావణి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలనతో సదస్సును ప్రారంభించి మాట్లాడారు. వైద్య పరీక్షల ఆధారంగా డాక్టర్లు నిర్ధేశించిన మందులనే వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు ప్రదర్శనలు తిలకించి ప్రశంసా పత్రాలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాళ్లు శంకర్, మధు, ప్రొఫెసర్లు స్వర్ణలత, బోధన, బోధనేతర సిబ్బంది, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

చెన్నేకొత్తపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల్లో సమస్యలపై ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని డీపీఓ సమత సిబ్బందిని ఆదేశించారు. చెన్నేకొత్తపల్లిలోని సచివాలయాన్ని శనివారం ఆమె సందర్శించి రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా స్వచ్ఛభారత్‌లో భాగంగా పంచాయతీలో చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణ గురించి ఆరాతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అదేవిధంగా పన్ను వసూళ్లు, పంచాయతీ కాంప్లెక్స్‌లకు సంబంధించి అద్దె వసూళ్లలో నిర్లక్ష్యం వద్దన్నారు. సాగు నీటి పథకాల పనితీరుపై అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా న్యామద్దల పంచాయతీలో చేపట్టిన స్వమిత్వ సర్వే జరుగుతున్న తీరుపై సిబ్బందిని అడిగితెలుసుకున్నారు.సర్వేను నిర్లక్ష్యం లేకుండా చేపట్టాలని సూచించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ అశోక్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ సమత

టమోటా కిలో రూ.23

అనంతపురం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి):కక్కలపల్లి టమో టా మార్కెట్‌లో శనివారం కిలో టామోటా గరిష్ఠంగా రూ.23తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.14, సరాసరి ధర రూ.19తో విక్రయాలు జరిగాయన్నారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

నార్పల,ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సీపీఐ కాలనీలో ఓ వ్యక్తి భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికుడైన షఫీ బేల్దారి పని చేస్తుండేవాడు. కాగా అతను మద్యానికి బానిసై గత కొంతకాలంగా భార్యాబిడ్డలకు దూరంగా ఉంటున్నాడు. ఈ క్రమంలో శనివారం అతను భార్యకు శనివారం ఫోన్ చేసి గొడవపడ్డాడు. దీంతో తీవ్ర మనస్థాపం చెంది స్థానిక తిక్కస్వామి ఆలయ సమీపంలో విషద్రావకం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని ఆటోలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. 108 వాహనంకు అనేకసార్లు ఫోన్ చేసినా రాలేదని సీపీఐ మండల కార్యదర్శి గంగాధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

'సీస్ నిధులపై వివక్ష తగదు'

అనంతపురం వైద్యం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): స్టేట్ ఎడ్యుకేషనల్ అసెస్మెంట్ సర్వే(సీస్) నిర్వహణ నిధులను జిల్లాకు విడుదల చేయడంలో వివక్షచూపడం తగదని ఆర్‌ఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, మండల విద్యాశాఖ అధికారుల సంఘం రాష్ట్ర నాయకుడు డాక్టర్ రామచంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీస్ నిర్వహణ పారితోషికం రూ.20లక్షలు జిల్లాకు విడుదలచేయాల్సి ఉందన్నారు. అయితే సమగ్రశిక్ష ఎస్పీడీ నిర్లక్ష్యంతో నిధులను వెనక్కి పంపారని మండిపడ్డారు. స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పందించి నిధులను విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మత్యాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పాపంపేటకు ఎమ్మెల్యే రాక

అనంతపురంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపంపేటకు ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదివారం రానున్నట్లు జడ్పీటీసీ మాజీ సభ్యుడు వేణుగోపాల్ శనివారం ప్రకటనలో తెలిపారు. డ్వాక్రా మహిళలకు స్వయం ఉపాధి రుణాలకు సంబంధించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారన్నారు. అంతకుమునుపు ఉదయం 9గంటలకు పాపంపేట సర్కిల్లోని జియో ఆఫీస్ నుంచి ర్యాలీ ఉంటుందన్నారు. అనంతరం జొన్నా ఐరన్‌మార్ట్ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇన్‌క్లూజివ్, ఎక్స్‌క్లూజివ్ డిపార్ట్‌మెంట్‌ను రద్దు చేయాలని వినతి

అనంతపురంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఇన్‌క్లూజివ్, ఎక్స్ క్లూజివ్ డిపార్ట్‌మెంట్‌ను రద్దు చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఎస్కే యూనివర్సిటీ కార్యదర్శి రమణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వర్సిటీ రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ..ఇన్‌క్లూజివ్ ఎక్స్‌క్లూజివ్ డిపార్ట్‌మెంట్ వల్ల గత కొన్ని సంవత్సరాలుగా వర్సిటీకి గానీ..విద్యార్థులకు ఉపయోగం లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, మహేష్‌బాబు, సూర్య, అంబేడ్కర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పరిటాల రవీంద్ర జయంతి

అనంతపురంరూరల్,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 67వ జయంతి వేడుకలను మండలంలోని పలు గ్రామాల్లో టీడీపీ శ్రేణులు శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యంగా కురుగుంట వైఎస్సార్ కాలనీలో రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అలాగే స్థానిక విద్యార్థులకు బుక్కులు, పెన్నులు పంపిణీ చేశారు. పార్టీ మండల మాజీ కన్వీనర్ లక్ష్మీనారాయణ, కురుగుంట, చిన్నంపల్లి గ్రామాల నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా ఆలమూరు గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఆలమూరు సూరి పరిటాల రవి జయంతి సందర్భంగా కేక్‌కట్ చేశారు. అలాగే అన్నదానం చేపట్టారు. సత్య హరిశ్చంద్ర ఉచిత నాటక ప్రదర్శన నిర్వహింపజేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●చెన్నేకొత్తపల్లి: మండలకేంద్రంలో టీడీపీ నాయకులు స్థానిక పార్టీ కార్యాలయంలో పరిటాల రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు యజ్ఞేశంకర్, ముత్యాలప్ప, చెన్నకేశవులగౌడ్, శివ, రాజు, హరినాథరెడ్డి, ఉత్తర కుమార రెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

●ఆత్మకూరు: మండలకేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలు పరిటాల రవి చిత్రపటానికి పూలమాల వేసి నివాలర్పించారు. అనంతరం కేక్ కేట్ చేశారు. పార్టీ మండల కన్వీనర్ శ్రీనివాసులు, మాజీ కన్వీనర్లు, నాయకులు మనోరంజన్, వేణగోపాల్,సూరి,నాగేంద్ర,ఓబుళపతి,రవీంద్రారెడ్డి,రాజా రమేష్,తిక్కస్వామి, సరళ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



కురుగుంట, ఆలమూరు గ్రామాల్లో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

చెన్నంపల్లి ఘటనపై విచారిస్తాం: డీఎస్పీ

రాప్తాడు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామంలో వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా పోలీసులు, గ్రామస్థుల మధ్య జరిగిన ఘర్షణపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశులు తెలిపారు. రాప్తాడులోని రూరల్ డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఆయన బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చెన్నంపల్లిలో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనం కార్యక్రమానికి పోలీసులు బందోబస్తు వెళ్లారన్నారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో కొందరు యువకులు రంగులు చల్లుకునే క్రమంలో పోలీసులపై కూడా చల్లారన్నారు. అయితే చీకటి పడుతోంది నిమజ్జనం త్వరగా పూర్తి చేయాలని పోలీసులు ఆదేశించడంతో... తొందరగా ఎందుకు వెళ్లాలంటూ ఒక వ్యక్తి పోలీసు కాలర్ పట్టుకున్నాడన్నారు. ఈ క్రమంలో పోలీసులు, కాలర్ పట్టుకున్న వ్యక్తి మధ్య ఘర్షణ జరిగిందన్నారు. పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వారిని అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించగా గ్రామంలోని మహిళలు అడ్డురావడంతో పోలీసులు సంయమనం పాటించారన్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.


మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ వెంకటేశులు

'దివ్యాంగులపై జగన్ మొసలి కన్నీరు'

అనంతపురం క్రైం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులపై మాజీ సీఎం జగన్ మొసలి కన్నీ రు కారుస్తున్నారని, వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు వారి పట్టించుకోని ఆయన ఇప్పుడు మాత్రం ఎనలేని ప్రేమ చూపుతున్నారని విభిన్న ప్రతిభావంతులు, వృద్ధపౌరుల కార్పొరేషన్ చైర్మన్ గడిపూటి నారాయణస్వామి విమర్శించారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దివ్యాంగుల పింఛన్లపై వైసీపీ నాయకులు నిత్యం అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. వాటిని ఎవరూ నమ్మవద్దని, అర్హులందరికీ 1వ తేదీన పింఛన్లు అందుతాయని పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పింఛన్‌దారులను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. దివ్యాంగులపై, వృద్ధులపై జగన్‌కు అంతప్రేమ ఉంటే అప్పుడు వారి పింఛన్లను ఎందుకు పెంచలేదని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ పింఛన్ల పెంపు చేశారన్నారు. ఈనెల 31తేదీ సాయంత్రం వరకూ దివ్యాంగుల నుంచి అప్పీళ్లు తీసుకుంటారన్నారు. 1వ తేదీన అర్హులందరికీ పింఛన్లు అందుతాయన్నారు. కూటమి ప్రభుత్వం విభిన్న ప్రతిభావంతుల సంక్షేమం కోసం పాటుపడుతోందన్నారు. కార్యక్రమంలో సత్యసాయి జిల్లా టీడీపీ విభిన్న ప్రతిభావంతుల సంఘం అధ్యక్షుడు నాగూర్ ఉమర్, హిందూపురం పార్లమెంట్ జిల్లా కార్యదర్శి సుబహాన్, ఇతర నాయకులు షాజహాన్, శ్రీకృష్ణ, క్రిష్ణగోపాల్, ఎర్రిస్వామి, చంద్ర, అశోక్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గడిపూటి నారాయణస్వామి

దివ్యాంగుల అభ్యున్నతికి తోడ్పడాలని వినతి

అనంతపురం విద్య: జిల్లాలో దివ్యాంగుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని జిల్లా దివ్యాంగుల సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో వారు దివ్యాంగుల కార్పొరేషన్‌చైర్మన్ నారాయణస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిదివ్యాంగుడికి పింఛన్ వచ్చేలా చూడాలని, దివ్యాంగులకమిటీ హాల్ ఏర్పాటుచేయాలని, బ్యాక్‌లాగ్‌పోస్టుల భర్తీకి తగిన చర్యలు తీసుకోవాలని, సబ్సిడీ రుణాలు మంజూరుచేసి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో దివ్యాంగులహక్కుల పోరాటసమితిరాష్ట్రఅధ్యక్షుడు షఫీ, జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, మహిళాఅధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్‌హరినాథ్‌రెడ్డి, నాయకులు అల్లాపుద్దీన్, ఈశ్వర్, రసూల్, అక్కులప్ప రామిరెడ్డి పాల్గొన్నారు.

'పరస్పర సహకారంతో సొసైటీల బలోపేతం'

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి):పరస్పర సహకారంతోనే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (సొసైటీ) బలోపేతమవుతాయని ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖరాణి పేర్కొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతపురం డివిజన్ సహకార శాఖ అధికారి (డీఎల్‌సీఓ) వెంకటరామిరెడ్డిని శనివారం స్థానిక రామ్‌నగర్‌లోని రాయలసీమ సహకార శిక్షణా కళాశాల ఆవరణలో గల కార్యాలయంలో ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న సొసైటీలను సంస్థాగతంగా బలోపేతం చేసి, రైతులకు మరిన్ని సేవలు అందించేందుకు సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఇరువురు చర్చించారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులతో పాటు ప్రజలకు ఆర్థికంగా సహకారం అందించడానికి సొసైటీలపై మరింత నమ్మకాన్ని పెంచాలని నిర్ణయించారు. పరస్పర సహకారంతోనే సొసైటీల అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

● జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అధికారులు, సిబ్బంది క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. వ్యవసాయ శాఖ జిల్లా కార్యాలయంలో ఏడీఏలు, ఏఓలతో ఆమె శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి ఈ పంట నమోదును సకాలంలో పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. యాంత్రీకరణ పథకం ద్వారా అర్హులైన రైతులను గుర్తించాలన్నారు. పొలం పిలుస్తోంది, పొలం బడి కార్యక్రమాలను నిర్దేశించిన మేరకు నిర్వహించాలన్నారు. రైతు సేవా కేంద్రాల్లోనూ ఈ పోస్ యంత్రాల ద్వారా ఎరువుల పంపిణీ జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం సాగైన పంటల్లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు వివరించాలన్నారు. రేకుల కుంట ప్రధాన శాస్త్రవేత్త విజయశంకర్‌బాబు, రెడ్డిపల్లి కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరిలు ప్రస్తుతం సాగులోని పంటల్లో తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు తదితర అంశాలను వివరించారు. 100 మంది రైతు సేవా కేంద్రం సిబ్బందికి రైతులకు ఎరువుల పంపిణీ కోసం ఈ పోస్ యంత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏఓలు రాకేష్‌నాయక్, సునీత, వంశీకృష్ణలతోపాటు ఏడీఏలు, ఏఓలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇళ్ల వద్దే బియ్యం పంపిణీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు,65ఏళ్ల పైబడిన వృద్ధులకు ఇళ్ల వద్దకే రేషన్ బియ్యం పంపిణీ చేయాలనే నిర్ణయం ఆ వర్గాల్లో సంతృప్తినిస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చాక ప్రతి నెలా 1వతేదీకి ముందుగానే వికలాంగులకు, వృద్ధులకు ఇళ్ల వద్దకే వెళ్లి రేషన్ బియ్యం అందించాలని ఆదేశాలిచ్చింది. ఆ మేరకు డీలర్లు వాటిని అందజేస్తున్నారు. అందులో భాగంగా శనివారం నగరంలోని కోర్టురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం ఎదుట జొన్న రమేష్ అనే దివ్యాంగుడికి డీలర్ రేషన్ బియ్యం అందజేశారు.

గురవయ్య వేషంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సంచారజాతుల స్ఫూర్తి సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ గురవయ్య వేషంలో అలరించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆధ్వర్యంలో శనివారం విజయవాడలో సంచార జాతుల స్ఫూర్తి సదస్సు నిర్వహించారు. జిల్లా నుంచి అధికసంఖ్యలో బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ గురవయ్య వేషంలో కళాకారులతో కలిసి సంచారజాతులు, కులవృత్తులు, సంప్రదాయ కళల నృత్యాలతో కనువిందు చేశారు. సంచారజాతులను చైతన్యం చేయడానికి రాష్ట్రస్థాయి సభ నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, నాయకులు ఆవుల చక్రధర్‌యాదవ్, అయ్యన్న, ఆనంద్, నాగేంద్ర, సురేంద్ర, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.


గురవయ్య వేషంలో కొనకొండ్ల రాజేష్

సంక్షిప్త వార్తలు

వైభవంగా పల్లకి సేవ



ఉత్సవ మూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

ఉరవకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకిసేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి, పల్లకిలో కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ ఊరేగించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన రాము

బెళుగుప్ప, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రాహ్మణపల్లి వద్ద కణేకల్లు మండలం యర్రగుంటకు చెందిన వడ్డె రాము (38) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు పోలీసులు శనివారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాము శుక్రవారం రాత్రి స్వగ్రామం నుంచి బైకుపై భార్య స్వగ్రామమైన ఐదుకల్లుకు వెళుతుండగా డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు గమనించి కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా వుండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య మహాలక్ష్మీ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ తెలిపారు.

యథావిధిగా దివ్యాంగులకు పింఛన్లు

కళ్యాణదుర్గం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దివ్యాంగులు పింఛన్లను సెప్టెంబరు నెలలో యథావిధిగా పంపిణీ చేస్తామని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి శనివారం పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గత 15 రోజులుగా దివ్యాంగ పింఛన్లు రద్దు చేశారంటూ జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. దివ్యాంగుల పింఛన్లు అందుకుంటున్న వారికి రాష్ట్ర వ్యాప్తంగా పునఃపరిశీలన కోసం వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. అందులో 40 శాతం కంటే తక్కువగా ఉన్న వారికి నోటీసులు ఇచ్చారని అన్నారు. వీరు దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి తప్పకుండా పింఛన్లు అందచేస్తామన్నారు.

రిజర్వాయరుకు 2094 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు 2094 క్యూసెక్కులు వస్తున్నట్లు శనివారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద 2054 క్యూసెక్కులు వెళుతుండగా ప్రస్తుతం రిజర్వాయరులో 1.708 టీఎంసీల నీటి నిల్వ వుందని వెల్లడించారు. ఫేజ్-2కు 1802 క్యూసెక్కులు వెళుతుందని అధికారులు తెలిపారు.

సజ్జ పంటలో పురుగును నివారించాలి



సజ్జకు ఆశించిన పురుగు

గుత్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): సజ్జ పంటకు శనగ పచ్చపురుగు ఆశించి పంటను నాశనం చేసే పరిస్థితులు ఉన్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని ఏడీఓ వెంకటరాముడు తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా ఈ ఏడాది 1852 హెక్టార్లలో గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, శింగనమల, యాడికి మండలాల్లో సజ్జ పంట సాగు చేశారు. కురుస్తున్న వర్షాల వల్ల వాతావరణ పరిస్థితులు మార్పుల వల్ల శనగపచ్చ పురుగు అశించిందన్నారు. వీటి నివారణకు సైయాన్త్రా నిలీప్రోల్(బేసివియా) 200 మిల్లి లీటర్లు 200 లీటర్ల నీటిలో లేదా ప్రొపెనోపాల్, సైఫర్ మెత్రిన్ 400 మిల్లీ లీటర్లు.. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. దీంతో పచ్చ పురుగు నశించి అధిక దిగుబడి వస్తుందని తెలిపారు.

ఉడేగోళంలో చోరీ

రాయదుర్గం రూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళంలోని నల్లపట్ట బాబు అనే వ్యక్తి ఇంట్లో శనివారం చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. ఉడేగోళం గ్రామానికి చెందిన బాబు తమలపాకుల వ్యాపారం చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. అతడి భార్యకు అనారోగ్యంగా ఉండడంతో నాలుగు రోజుల క్రితం బళ్లారిలో చికిత్స చేయించుకుని శనివారం తిరిగి గ్రామానికి చేరుకుని చూడగా ఇంట్లో ఉన్న తొమ్మిది తులాల బంగారం చోరీ జరిగినట్లు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం

తాడిపత్రి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రతిపాదలనకు కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయంలో శనివారం వైస్ చైర్మన్ ఎల్లుట్ల షెక్షావలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో దాదాపు 32 అజెండాలను సభ్యులకు వినిపించి ఆమోదం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటివద్ద రెండు సెంట్లు స్థలాన్ని ఆక్రమించుకున్నారని, వాటిని అధికారికంగా కొలతలు వేయించి ఇవ్వాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. పుట్లూరు రోడ్డు, నంద్యాలరోడ్డు, ఎస్టీపీ-1 వద్ద డ్రైనేజీ సమస్య ఉన్నందున వాటికి పనులు చేయడానికి నిధులు మంజూరు చేశారు. వీటితోపాటు మరిన్ని ఆమోదించారు.

మొక్కల పంపిణీ

తాడిపత్రి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేవీవీ గోపాల్‌రెడ్డి టింబర్‌డిపో నిర్వాహకుడు గోపాల్‌రెడ్డి 1200 మొక్కలను పంపిణీ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక గాంధీకట్ట వద్ద ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పాటు చేసిన వినాయకుడి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, హరీశ్‌రెడ్డి, నారాయణస్వామి, గంగాధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న నాయకులు

సచివాలయం మొత్తం ఖాళీ..!

● 10 మందిలో ఒక్కరూ లేని వైనం ● మధ్యాహ్నం ఒంటి గంట వరకూ బోసిపోయిన కార్యాలయం



సచివాలయంలో ఖాళీగా ఉన్న కార్యదర్శి సీటు

ఆంధ్రజ్యోతి విజిట్

విడపనకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో శనివారం ఒక్క ఉద్యోగి కూడా విధులకు హాజరు కాలేదు అంటే ఇక్కడ పరిస్థితి ఎంత దారుణంగా ఉందో ఇట్టే అర్థమవుతోంది. 'ఆంధ్రజ్యోతి' సచివాలయాన్ని విజిట్ చేసినప్పుడు కార్యాలయం బోసిపోయి కనిపించింది. విడపనకల్లు సచివాలయంలో 10 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. శనివారం ఈ 10 మంది ఎక్కడికి వెళ్లారో కానీ.. ఒక్కరు కూడా విధులకు హాజరు కాలేదు. ఉదయం 11.30 గంటలకు ఓ టీడీపీ కార్యకర్త సచివాలయం తలుపులు తెరిచి కూర్చున్నాడు. ఓంకారప్ప అనే రైతు నీటి తీరువా పన్ను కట్టేందుకు స చివాలయం వద్దకు వచ్చాడు. ఇక్కడ ఏ అధికారి లేక పోవటంతో అందరూ ఎక్కడి వెళ్లారు అంటూ అక్కడున్న వారిని అడిగి వెళ్లి పోయాడు. మధ్యా హ్నం 1గంట అయినా ఏ ఒక్కరు సచివాలయానికి రాలేదు. విడపనకల్లులో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శి బదిలీపై వెళ్లటంతో వేల్పుమడుగు కార్యదర్శికి విడపనకల్లు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీం తో ఆయన రెండు గ్రామ పంచాయతీలను చూసుకునే పరిస్థితి వచ్చింది. ఈ విషయమై ఎంపీడీఓ షకీలా బేగంను వివరణ కోరగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బందిలో వెల్ఫేర్ అసిస్టెంట్ పింఛన్లకు సంబంధించిన డబ్బులు తెచ్చేందుకు వెళ్లాడని, డిజిటల్ అసిస్టెంట్ ఒకరు అనంతపురంలో ఆధార్ లాగిన్ చేయటానికి వెళ్లారని, జీఎస్ఎంకే, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సెలవులో ఉన్నారని తెలిపారు. ఏఎన్ఎం, వీఆర్వో హాజరు వేసి ఫీల్డ్‌కు వెళ్లారని వివరించారు. సర్వేయర్, వెటర్నరి, కార్యదర్శులు పనులపై బయటకు వెళ్లినట్లు తెలిపారు. పది మందిలో ఒక్కరు కూడా లేక పోయినా, జవాబు చెప్పే దిక్కు లేకపోయినా అధికారు లు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. .



ఖాళీగా డిజిటల్ అసిస్టెంట్ కుర్చీ

ఘనంగా వినాయక నిమజ్జనం



గుంతకల్లులో నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో..

గుంతకల్లుటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలుచోట్ల నెలకొల్పిన వినాయక ప్రతిమలను శనివారం ఘనంగా నిమజ్జనం చేశారు. స్థానిక రైల్వే క్రీడామైదానం సమీపంలోని వినాయక దేవాలయంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, శ్రీనివాసులు, తహసీల్దారు రమాదేవి పూజలు చేశారు. అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. మండపాలలో కొలువుదీరిన వినాయకులను ట్రాక్టర్లు, ఆటోలు, తోపుడు బండ్లలో ఊరేగింపు నిర్వహించారు. రైల్వే క్రీడా మైదానం నుంచి మెయిన్ రోడ్డులో మేళతాళాలు, డీజేలతో యువకులు కేరింతలు, నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా తీసుకెళ్లారు. మార్కెట్ యార్డు సమీపంలోని వినాయక ఘాట్‌కు చేరుకున్నాయి. అనంతరం జీబీసీ కాలువలో నిమజ్జనం చేశారు. నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.





కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో ఊరేగింపు..
యాడికిలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకులు

● యాడికి: పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయ కుడి విగ్రహాలను ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు. ఈ సంద ర్భంగా యువత పెద్దఎత్తున నృత్యాలు చేస్తూ కేరింతలు కొట్టింది.

● పామిడి : పట్టణంలోని పాండురంగస్వామి గుడి వద్ద ఏర్పాటు చేసి న లాల్ భాగ్ చా రాజా గణపతి లడ్డు వేలం పోటాపోటీగా జరిగింది. లడ్డు ను గడ్డాలే నాగేంద్రరావు రూ. 23వేలకు సొంతం చేసుకున్నారు. గత ఏడాది కం టే ఈ ఏడాది రూ. 5వేలు అదనంగా వేలం పాడినట్లు నిర్వహకులు తెలిపారు.

'అపర భగీరథుడు చంద్రబాబు'



జల హారతి ఇస్తున్న వెంకటశివుడు యాదవ్, గుమ్మనూరు నారాయణ స్వామి

గుంతకల్లు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): పట్టువదలని విక్రమార్కుడిలా హంద్రీనీవా వెడల్పు పనులను పూర్తిచేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు అపర భగీరథుడయ్యారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి పేర్కొన్నారు. హంద్రీనీవా నీరు కుప్పంకు చేరడంతో సీఎం చంద్రబాబు నాయుడు జలహారతి చేసిన సందర్భంగా.. స్థానిక టీడీపీ నాయకులు హంద్రీనీవాకు శనివారం ఉదయం పూజ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు శ్రీనివాసులు, బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, రంగన్న, జగన్, గుణ, ఫజులు, రామన్నచౌదరి, ఫ్రూట్ మస్తాన్, ఖాజా, వీరేశ్, చిప్పగిరి ప్రతాప్, వెంకటేశులు, శ్రీరాములు పాల్గొన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

పామిడి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మట్కా నిర్వహిస్తున్న ఎనిమిది మంది బీటర్లను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు సీఐ యుగంధర్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఎనిమిది మంది మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. పోలీసులను చూసి పారిపోతుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.1,13,900లు నగదు, మట్కా చీటీలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వైద్యసేవలు అందించాలని సీపీఐ ధర్నా

కణేకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యులు, సిబ్బంది రోగులకు సక్రమంగా వైద్యం అందించడం లేదంటూ సీపీఐ నాయకులు శనివారం ఆసుపత్రి ముందు ధర్నాకు దిగారు. చిన్న చిన్న రోగాలకు సైతం తాము జిల్లా కేంద్రానికి రెఫర్ చేస్తూ రోగులను అనేక రకాలుగా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు గౌస్‌పీర్, ముల్లాసర్మాస్, అనుమేష్, షబ్బీర్, జిలాన్, హుస్సేన్, హసీనా పాల్గొన్నారు.

గొర్రెల విక్రయంపై విచారణ..?

గుట్టుగా దర్యాప్తు చేస్తున్న ప్రకాశం జిల్లా పోలీసులు

పామిడి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గొర్రెల క్రయ విక్రయాలపై గార్లదిన్నె, పామిడి మండలాలకు చెందిన పలువురిని ప్రకాశం జిల్లా పోలీసులు గుట్టుగా విచారిస్తున్నారు. సమాచారం మేరకు... గార్లదిన్నె మండలం కొప్పలకొండ, కల్లూరు గ్రామాలకు చెందిన ఇద్దరు వ్యక్తులు ప్రకాశం జిల్లా గిద్దలూరు తాలుకా ఎర్రగొండపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో గొర్రెలు క్రయ విక్రయాలు చేపట్టారు. మొదట్లో గొర్రెలకు ఎక్కువ ధర చెల్లించి నమ్మకం ఏర్పరచుకున్నారు. ఆ విధంగా పలుమార్లు గొర్రెలు కొనడం, అమ్మడం చేపట్టారు. వారంలో డబ్బులు చెల్లిస్తామని నమ్మించి దాదాపు రూ.4కోట్ల విలువ చేసే 2700 గొర్రెలను పలు దఫాలుగా తోలుకొచ్చారు. గొర్రెల డబ్బులు చెల్లించకపోవడంతో మోసపోయామని భావించిన బాధితులు అక్కడి పోలీసులను ఆశ్రయించారు. దీంతో వారు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. విచారణలో భాగంగా పామిడిలో ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకునేందుకు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కల్లూరు, పామిడి గ్రామాల్లో ప్రకాశం జిల్లాకు చెందిన ఒక సీఐ, ఇద్దరు ఎస్‌ఐలు, సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిసింది.

నేమకల్లు అంజన్నకు విశేష పూజలు



బొమ్మనహాళ్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామికి శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అనిల్‌కుమార్‌చార్యులు పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. వందలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

● రాయదుర్గంరూరల్: మండలంలోని వడ్రవన్నూరు గ్రామ సమీపంలో వెలసిన అప్పులాపురం ఆంజనేయస్వామి దేవాలయం, మల్లాపురం గ్రామ సమీపంలో వెలసిన విప్రమలై లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు.

సోలార్ టవర్స్ ఏర్పాటుతో ఉపాధి

బొమ్మనహాళ్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ముందుకు వస్తోందని, దీంతో యువతకు ఉపాధి లభిస్తుందని తహసీల్దార్ మునివేలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని శ్రీధరఘట్ట, గోనేహాల్ గ్రామాల్లో సోలార్ టవర్స్, లైన్ ఏర్పాటుకు భూసేకరణ చేసేందుకు రైతులతో సమావేశం నిర్వహించారు.

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని భైరసముద్రం వద్ద 40 ఎకరాల భూమిని తహసీల్దార్ సుమతి, ఆర్‌ఐ నాగిరెడ్డి, వీఆర్వో నాగరాజు శనివారం పరిశీలించారు.

మొరాయించిన బస్సు

కూడేరు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): అనంతపురం- ఉరవకొండ మధ్య తిరుగుతున్న ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు రేడియేటర్‌లో పొగలు రావడంతో ప్రయాణికులు ఆందోళన చెందారు. శనివారం ఉదయం అనంతపురం నుంచి ఉరవకొండకు దాదాపు 45 మంది ప్రయాణికులతో బయలుదేరింది. కూడేరు మండలం అరవకూరు గ్రామం దాటిన తర్వాత బస్సు రేడియేటర్‌లో పొగలు వస్తూ మొరాయించింది. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ వెంటనే బస్సు నిలిపివేశారు.

తప్పిన ప్రమాదం

కుందుర్పి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బెస్తరపల్లి చెక్‌పోస్టు వద్ద శనివారం పెను ప్రమాదం తప్పింది. బెస్తరపల్లి చెక్‌పోస్టు మలుపు వద్ద ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి కారు గుంతలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

గ్రంథాలయం తనిఖీ

గుమ్మఘట్ట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా కార్యదర్శి రమ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ రికార్డులను పరిశీలించి సమస్యలను అధికారి నాగరాజును అడిగి తెలుసుకున్నారు.

శోభాయాత్రను జయప్రదం చేయండి

తాడిపత్రి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం జరిగే శోభాయాత్రలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని జై శ్రీరామ్ భక్త మండలి అధ్యక్షుడు నిచ్చెనమెట్ల రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలోని గాంధీసర్కిల్ నుంచి సీబీ రోడ్డు మీదుగా పోలీస్‌స్టేషన్ సర్కిల్‌కు చేరుకుంటుందన్నారు. పెన్నానది ఒడ్డున నిమజ్జనం ఉంటుందన్నారు. సభ్యులు నరసింహారెడ్డి, లక్ష్మీనారాయణ, జయన్న, మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

పరిటాల సేవలు ఎనలేనివి

కళ్యాణదుర్గం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర సేవలు ఎనలేనివని టీడీపీ నాయకులు కొనియాడారు. శనివారం పట్టణంలోని ప్రజావేదిక వద్ద పరిటాల రవీంద్ర జయంతిని ఘనంగా జరుపుకున్నా రు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ.. పేదల అభ్యున్నతి కోసం పరిటాల రవి పోరాటాలు చేస్తూ, అండగా నిలిచారన్నారు. ఆయన దూరమైనప్పటికీ సేవలు మాత్రం చిరస్మరణీయంగా నిలిచిపోయాయన్నారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్, తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొండాపురం అనీల్ చౌదరి, సింగిల్ విండో అధ్యక్షుడు మల్లిపల్లి నా రాయణ, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ధనునాయక్, నాయకులు కొల్లాపురప్ప, అబ్దుల్ రహీం, గౌని శ్రీనివాసరెడ్డి, మురళీ, సునీల్, రమణ పాల్గొన్నారు.



కళ్యాణదుర్గంలో పరిటాల రవి చిత్రపటం వద్ద టీడీపీ నాయకుల నివాళి

● యాడికి : మాజీ మంత్రి పరిటాల రవి పేదల ఆశాజ్యోతి అని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య తెలిపారు. ఆయన జయంతిని పురస్కరించుకొని రాయలచెరువులో చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్‌నాయుడు, అనిల్, నాగరాజు గౌడ్, జాఫర్, రమేష్, నరేంద్రబాబు, ఖాజా, నాగేంద్ర పాల్గొన్నారు.

● పామిడిలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర జయంతిని ఘనంగా నిర్వహించారు. రవీంద్ర చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచిన ప్రజా నాయకుడు రవీంద్ర అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు బొల్లు శ్రీనివాసరెడ్డి, గౌస్‌పీరా, ప్రభాకర్ చౌదరి, కొట్టం మా లిక్ బాషా, శ్రీనివాసులు, మోహన్‌కృష్ణ, నారాయణస్వామి, కుమార్, శ్రీనివాసులు, తిమ్మప్ప, అంజి, సురేష్ నాయక్, పురుషోత్తం పాల్గొన్నారు.

నేడు వాహనాల దారి మళ్లింపు



గండికోట ప్రాజెక్ట్ వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తాడిపత్రి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా ఆదివారం అనంతపురం నుంచి తాడిపత్రి, కడపకు వెళ్లే వాహనాలను దారి మళ్లిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆటోనగర్ మీదుగా పుట్లూరురోడ్డు, యల్లనూరురోడ్డు, ఐశ్వర్యవిల్లాస్ వద్ద నుంచి కడప వైపునకు వెళ్లాలని సూచించారు. నంద్యాలకు వెళ్లే వాహనాలు అనంతపురం నుంచి ఫ్లైఓవర్, శ్రీనివాసపురం, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద నుంచి కొత్త బ్రిడ్జి, చుక్కలూరురోడ్డు, సజ్జలదిన్నెమీదుగా వెళ్లాలని పేర్కొన్నారు. కడప నుంచి నంద్యాలకు వెళ్లే వాహనాలు ఐశ్వర్యవిల్లాస్, పుట్లూరురోడ్డు, ఆటోనగర్ ఫ్లైఓవర్, శ్రీనివాసపురం, శ్రీకృష్ణదేవరాయల విగ్రహం, కొత్తబ్రిడ్జి, చుక్కలూరురోడ్డు, సజ్జలదిన్నె నుంచి నంద్యాలకు వెళ్లవచ్చుని తెలిపారు. అనంతరం వినాయక నిమజ్జనానికి కడప జిల్లా సుగుమంచిపల్లి వద్ద గండికోట ప్రాజెక్ట్‌లోకి వేసేందుకు రెండుచోట్ల క్రేన్లు, లైటింగ్ ఏర్పాటుచేశారని, అక్కడే నిమజ్జనం చేయాలని తెలిపారు. ఏర్పాట్లను అడిషనల్ ఎస్పీ రోహిత్‌కుమార్‌చౌదరి, రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి, ఎస్‌ఐ ధరణీబాబు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు.

గుత్తి ప్రత్యేక జైలు తనిఖీ



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి రాజశేఖర్

గుత్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రత్యేక జైలును శనివారం జిల్లా లీగల్ సర్వీసెస్ ఆథారిటీ కార్యదర్శి రాజశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ జైలులో రికార్డులను పరిశీలించారు. అనంతరం బ్యారెక్‌లు, టాయిలెట్లు, వంట గది, స్టోర్ రూంను ఆయన తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలతో మాట్లాడారు. జైలు ఆవరణంలో కంపోస్ట్ యార్డు ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ గంగాధర్‌కుమార్, జైలు సూపరింటెండెంట్ మహేశ్వరుడు, కోర్టు సిబ్బంది సాధిక్ వలి, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ. 25 వేల ఆర్థిక సాయం



విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లను అందజేస్తున్న నిర్వాహకులు

కణేకల్లు, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రగుంట ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పది మంది ప్రతిభా విద్యార్థులకు బయోస్టాట్ కంపెనీ ఆధ్వర్యంలో రూ. 25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. శనివారం బయోస్టాట్ సేల్స్ ఆఫీసర్ వీరేష్ ఆధ్వర్యంలో ఒక్కో విద్యార్థికి రూ. 2500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల్లో పది మందిని గుర్తించి వారికి స్కాలర్‌షిప్ రూపంలో ఈ సొమ్మును అందజేశామని అన్నారు. కణేకల్లు క్రాసింగ్‌కు చెందిన శివగంగ ట్రేడర్స్ యజమాని శరత్ పదో తరగతి చదువుతున్న 120 మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందజేశారు.

బాలుడికి డెంగీ

రాయదుర్గంరూరల్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయంపల్లికి చెందిన బాలుడు అరవింద్(4) డెంగీతో బళ్లారి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు శనివారం తెలిపారు. తండ్రి ఆంజనేయులు తెలిపిన మేరకు మూడు రోజుల నుంచి జ్వరం రావడంతో రాయదుర్గంలో ఓ క్లినిక్‌లో చికిత్స అందించారు. జ్వరం ఎక్కువ కావడంతో బళ్లారిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరిశీలించి డెంగీగా నిర్ధారించారని తండ్రి తెలిపాడు. చిన్న కుమారుడు ధృవాంత్‌కు కూడా రెండురోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించినట్లు తెలిపాడు.

హంద్రీనీవా కాలువలో మృతదేహం

ఉరవకొండ, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం రాగులపాడు పంప్‌హౌస్ వద్ద కర్నూలు జిల్లా హాలహర్వి మండలం సిద్ధరాంపురం గ్రామానికి చెందిన బసవన్నగౌడ్(53) మృతదేహం లభ్యమైంది. ఆయన ఈ నెల 27వ తేదీన గుంతకల్లు మండలం కసాపురం ప్రాంతానికి వెళ్లారు. హంద్రీనీవా కాలువలో స్నానం చేసేందుకు దిగి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. కాలువ వద్ద దుస్తులు, చెప్పులు, ఆధార్ కార్డును ఈ నెల 28న సమీప రైతులు గుర్తించారు. ఆధార్ కార్డులో ఉన్న ఫోన్ నంబర్‌కు కాల్ చేసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి కాలువ పొడవునా గాలించినా ఫలితం లేకపోయింది. చివరకు రాగులపాడు పంప్‌హౌస్ వద్ద శనివారం మృతదేహం తేలియాడింది. పోస్టుమార్టం నిమిత్తం గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

బ్రహ్మసముద్రం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేపులపర్తి గ్రామంలో లక్ష్మీనరసింహ ఫర్టిలైజర్స్ దుకాణాన్ని తహసీల్దార్ సుమతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రస్తుతం యూరియా కొరత ఉన్నందున రైతులకు సక్రమంగా పంపిణీ చేయాలని, అధిక ధరలకు విక్రయించరాదని ఆదేశించారు. రికార్డులు సక్రమంగా వుండాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాజీ ఎంపీపీ గుండెపోటుతో మృతి



గుంతకల్లుటౌన్, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మాజీ ఎంపీపీ నాగభూషణం నాయుడు(72) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. నెలగొండ ఎంపీటీసీగా గెలుపొంది 2008-13 వరకు గుంతకల్లు మండల టీడీపీ ఎంపీపీగా పనిచేశారు. అంతకుముందు సింగిల్‌విండో ప్రెసిడెంట్‌గా పనిచేశారు. ఆయనకు భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణస్వామి, రామన్నచౌదరి, సింగిల్‌విండో అధ్యక్షుడు తలారి మస్తానప్ప, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌గుప్త, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, పలువురు టీడీపీ నాయకులు నెలగొండకు చెరుకొని నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్. జితేంద్రగౌడ్ నెలగొండ గ్రామానికి వెళ్లి నాగభూషణం భౌతికదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.